క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చానన్న కొండా సురేఖ



# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తిరుమల అడవుల్లోకి 'రోబో డాగ్'.. భక్తుల భద్రతకు టీటీడీ హైటెక్ సొల్యూషన్!



సంపుటి : 01 | సంచిక : 12 | శనివారం,- ఆగస్టు -22 -,2026 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | పేజీలు: 12 | వెల: అమూల్యం/-

## హెచ్-1బీలో కొత్త మార్పులు.. వైట్ హౌస్ సమీక్ష పూర్తి!




★హెచ్-1బీ వీసా ఫీజులను మరోసారి పెంచేందుకు ట్రంప్ సర్కారు ప్రయత్నాలు చేస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

ఢిల్లీ: అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ వలసల కట్టడే అజెండాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకెళుతున్నారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను తన ప్రధాన టార్గెట్‌గా మార్చుకున్నారు. రకరకాల మార్గాల్లో వీసా ఫీజులు పెంచి విదేశీయుల రాకను కట్టడి చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

## పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ

❖ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా

❖జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ

❖పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన



ఢిల్లీ : పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో మిగతా..2లో

## అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు భారత్‌ను ప్రపంచ కేంద్రంగా మార్చాలి

❖దేశ అంతరిక్ష రంగం గురించి కీలక వ్యాఖ్యలు చేసిన నరేంద్ర మోదీ

❖వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్టార్టప్‌లను కోరిన ప్రధాని

❖స్పేస్ స్టార్టప్‌లకు మోదీ పిలుపు

### స్పేస్ స్టార్టప్‌లకు మోదీ పిలుపు



మిగతాది 2లో

ఢిల్లీ : అంతరిక్ష రంగంలో ప్రపంచ ప్రతిభకు, కంపెనీలకు, పెట్టుబడులకు భారత్ ఒక ఆకర్షణ కేంద్రంగా మారగలదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు.

## ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ ను విజయవంతం చేయండి



★ఈ నెల 24న ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్

★తన క్యాంప్ కార్యాలయంలో బంద్ పోస్టర్ ను ఆవిష్కరించిన జగదీశ్ రెడ్డి

★ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 24న చేపట్టబోయే ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను బీఆర్‌టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి సూర్యాపేటలోని

# సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ

▶▶కేంద్రం అనుమతి లేక రేవంత్ రెడ్డి రద్దైన అమెరికా పర్యటన

▶▶రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వని విదేశాంగ శాఖ

▶▶లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగిరానున్న సీఎం రేవంత్‌రెడ్డి

### నిబంధనలు పాటించలేదని విదేశాంగశాఖ వివరణ



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం బ్రేక్ వేసింది. సీఎం యూఎస్ పర్యటనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి నిరాకరించింది. ఈ నెల 30 వరకు బ్రిటన్, అమెరికాలో సీఎం పర్యటన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అనుమతిని కోరింది. లండన్ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో గురువారం అక్కడకు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఎల్లుండి అమెరికాలోని బోస్టన్ కు వెళ్లాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. రాజకీయ కోణంలో అనుమతి ఇవ్వడం లేదని కేంద్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చిందని సీఎంవో కార్యాలయం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి అమెరికా పర్యటన రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. లండన్ నుంచి ఎల్లుండి నేరుగా హైదరాబాద్ రానున్నారు. షెడ్యూల్ ప్రకారం అమెరికా వెళ్లి అక్కడి విశ్వవిద్యాలయాలతో ఎంవోయూలు పూర్తి చేసుకోవాలని అధికారులకు మిగతా..2లో

## ప్రతీ రూపాయి రైతుల ఖాతాల్లోకి చేరాల్సిందే



●భూసేకరణ, ఆ ర్ అండఆర్ చెల్లింపుల్లో కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పనిచేయాలి

●తక్షణమే పంపిణీకి సిద్ధంగా దాదాపు రూ.1,200 కోట్లు

●నిధుల కోసం చూడొద్దు..

●అవార్డులు, టోకెన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

●అటవీ అడ్డంకులనూ యుద్ధప్రాతిపదికన తొలగించాలి

●నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్,ఆగస్టు 21 : భూమిని కోల్పోయిన రైతుకు ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం సకాలంలో అందకపోతే నిధులు మంజూరు చేసిన లక్ష్యమే నెరవేరదని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ప్రతీ రూపాయి అంతిమంగా భూమి కోల్పోయిన రైతు, నిర్వాసిత కుటుంబం ఖాతాలోకి చేరాల్సిందేనని, కలెక్టర్ల పీడీ ఖాతాల్లో నిధులు ఉండిపోవడం వల్ల ప్రయోజనం లేదని తేల్చిచెప్పారు. కీలక నీటిపారుదల

## సౌదీ-పాక్-టర్కీ రక్షణ కూటమిలో చేరేందుకు బంగ్లాదేశ్ ఆసక్తి



సంచలన ప్రకటన చేసిన బంగ్లాదేశ్ ప్రధాని ముఖ్య సలహాదారుడు హుమయూన్

మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్ లో చేరేందుకు సానుకూలంగా ఉన్నామని వెల్లడి

జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశాన్ని పరిశీలిస్తున్నామన్న హుమయూన్

ఢిల్లీ : సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీల మధ్య ఇటీవల కుదిరిన చారిత్రాత్మక రక్షణ ఒప్పందం 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్'లో చేరేందుకు మిగతా..2లో

## రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ



భూముల వేలంపై ఏదైనా ఉంటే హైకోర్టులోనే తేల్చుకోవాలన్న సీజేఐ ధర్మాసనం

పాన్‌మక్తా వద్ద సుమారు 11 ఎకరాల అమ్మకం కోసం టీజీఐఐసీ నోటిఫికేషన్

తదుపరి విచారణకు నిరాకరించిన సీజేఐ ధర్మాసనం

రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలంపై సుప్రీంలో విచారణ

హైదరాబాద్: రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలంపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏదైనా ఉంటే హైకోర్టులోనే తేల్చుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే రాయదుర్గం పాన్ మక్తా వద్ద రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూమి అమ్మకం కోసం టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేశారు. గతంలో కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, అప్పుడు రక్షించమని చెప్పిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని మిగతా..2లో

## అందరిపై వరలక్ష్మీ దేవి ఆశీస్సులు ఉండాలి



★వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

★అందరిపై వరలక్ష్మీ దేవి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష

★పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్న సీఎం

★కుటుంబ సౌభాగ్యం కోసం శ్రమించే మహిళలకు ప్రత్యేక శుభాకాంక్షలు

## శరవేగంగా రాజధాని అమరావతి పనులు ప్రతి నెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి

●ఈనెల 29న సీడ్ యాక్సెస్ రహదారి మూడోదశ పనులు ప్రారంభం

●ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలు పూర్తి

●తుళ్లూరులో శివాలయం జీర్ణోద్ధరణకు హాజరైన మంత్రి నారాయణ

●ఈనెల 29న సీడ్ యాక్సెస్ రహదారి మూడోదశ పనులు ప్రారంభిస్తామన్న మంత్రి నారాయణ




అమరావతి : రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈనెల 29న ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. రైతుల త్యాగాలతోనే అమరావతి తిరిగి రాజధానిగా రూపుదిద్దుకుందని, ల్యాండ్ పూలింగ్‌లో తుళ్లూరు రైతులు ఎంతో సహకరించారని అన్నారు. తుళ్లూరులో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామివారి ఆలయ పునఃశంకుస్థాపన మహోత్సవానికి హాజరైన మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే ఆలయం నుంచి రైతులు 'న్యాయస్థానం టు దేవస్థానం' పాదయాత్ర ప్రారంభించి మిగతా..2లో

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను



○విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆవేదన

○ఒక తండ్రిగా ఆ తల్లిదండ్రుల బాధను ఊహించలేకపోతున్నానని వ్యాఖ్య

○పాఠశాలల్లో శారీరక దండనలకు చోటులేదని స్పష్టీకరణ

○ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

మొదటి పేజి తరువాయి

## అందరిపై వరలక్ష్మీ దేవి ఆశీస్సులు ఉండాలి

అమరావతి : వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా తన సందేశాన్ని పంచుకున్నారు. "వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మీకు, మీ కుటుంబ సభ్యులకు నా శుభాకాంక్షలు" అని చంద్రబాబు పేర్కొన్నారు. సిరిసంపదలు, సౌభాగ్యానికి అధిదేవత అయిన వరలక్ష్మీ దేవి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాడిపంటలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా, సమృద్ధిగా ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబ సౌభాగ్యం కోసం శ్రమించే మహిళలందరికీ ఈ పవిత్ర పండుగ విశేషమైన శుభాలను, శాంతిని ప్రసాదించాలని ఆశిస్తున్నట్లు తన పోస్టులో పేర్కొన్నారు.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను

అమరావతి: పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇండియా టుడేలో ప్రచురితమైన కథనాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ లోకేశ్ ఈ విధంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ

పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తదుపరి విచారణకు నిరాకరణ : పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆ భూములకు, ఇప్పుడు వేలం వేయడానికి నోటిఫికేషన్ ఇచ్చిన భూములకు సంబంధం లేదని కోర్టుకు తెలిపారు. కంచ గచ్చిబౌలికి ఇప్పుడు వేలం వేసే భూములు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న సీజే ధర్మాసనం టీజీఐఐసీ ఇచ్చిన నోటిఫికేషన్‌లో తాము జోక్యం చేసుకోబోమని తెలిపింది. పిటిషన్‌పై తదుపరి విచారణకు నిరాకరించింది.

## పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ

గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

## ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ ను విజయవంతం చేయండి

తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈ-ఆటోలను కేటాయించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచడంతో పాటు ఓలా, ఉబర్, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే సొంతంగా యాప్‌ను ప్రారంభించాలని సూచించారు. బైక్ టాక్సీల అక్రమ రవాణాను అరికట్టాలని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు వారిని ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని, వాహన సారథి లైసెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ జీవో 60 ప్రకారం రేడియం స్టిక్కరింగ్ నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమాతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 24న నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## సౌదీ-పాక్-టర్కీ రక్షణ కూటమిలో చేరేందుకు బంగ్లాదేశ్ ఆసక్తి

బంగ్లాదేశ్ సానుకూలంగా ఉన్నట్లు ఆ దేశ ప్రధాని ముఖ్య సలహాదారు హుమయూన్ కబీర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సౌదీ-పాక్-టర్కీ త్రైపాక్షిక రక్షణ కూటమిలో బంగ్లాదేశ్ చేరడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... బంగ్లాదేశ్ తమ జాతీయ ప్రయోజనాలను, భద్రతా సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందంలో చేరే అంశాన్ని పరిశీలిస్తోందని ప్రధాని సలహాదారు హుమయూన్ కబీర్ తెలిపారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు ఈ భద్రతా ఒప్పందంపై సంతకాలు చేశాయి. నాటోలోని 'ఆర్టికల్ 5' నిబంధన మాదిరిగానే, ఈ కూటమిలోని ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా దానిని మిగిలిన సభ్య దేశాలపై జరిగిన దాడిగా పరిగణిస్తూ సంయుక్త ప్రతిఘటన చేపడతారు. టర్కీ ఇప్పటికే బంగ్లాదేశ్‌కు నాలుగో అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా ఉన్న నేపథ్యంలో, బంగ్లాదేశ్ కూడా ఈ కూటమి వైపు మొగ్గు చూపడం దక్షిణాసియా, పశ్చిమ ఆసియా భద్రతా సమీకరణాలపై, ముఖ్యంగా పొరుగున ఉన్న భారత్‌పై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

## డిజిటల్ చెల్లింపుల్లో కుదుపు

మన దేశంలో ఆర్థిక లావాదేవీలను డిజిటల్ రూపంలోకి మార్చిన చెల్లింపుల వ్యవస్థ 'యూపీఐ'... ఆర్థిక విప్లవాన్నే సృష్టించింది. అప్పటికప్పుడే జరిగే రియల్ టైమ్ చెల్లింపుల నెట్‌వర్క్‌లలో యూపీఐని సంఖ్యాపరంగా అతిపెద్ద వ్యవస్థగా ఇటీవలే అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సైతం గుర్తించింది. ప్రజా డిజిటల్ మౌలిక సదుపాయాల్లో భారత్‌ను అగ్రగామిగా పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై రుసుముల ప్రతిపాదనలు బాగా చర్చనీయాంశమయ్యాయి. నిజంగానే ఆ రుసుములు అమల్లోకి వస్తే ఫలితాలు ఎలా ఉంటాయి? కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) పద్ధతి అసాధారణ రీతిలో దేశంలోని అన్ని ప్రాంతాల వ్యాపారులు, వినియోగదారుల ఆదరణను చూరగొంది. ఫోన్ నంబర్లు, క్యూఆర్ కోడ్, మొబైల్ యాప్‌ల ద్వారా 'వ్యక్తి నుంచి వ్యక్తికి', 'వ్యక్తి నుంచి వ్యాపారి'కి వెనువెంటనే జరిగే చెల్లింపులు అద్భుతాన్నే సృష్టించాయి. కార్డు ద్వారా చెల్లింపులను సైతం అధిగమించి, అతివేగంగా ప్రాచుర్యం పొందాయి. 2016-17లో రెండు కోట్లతో మొదలైన యూపీఐ లావాదేవీల సంఖ్య 2025-26 నాటికి 24,162 కోట్లకు పెరిగాయి. వాటి విలువ రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. యూపీఐలో మొదట్లో 44బ్యాంకులు పాల్గొనగా, ఇప్పుడు వాటి సంఖ్య 700 దాటింది. సాధారణంగా అంతర్జాతీయ కార్డ్ నెట్‌వర్క్‌లు ఛార్జ్ చేసే కమీషన్‌ను వ్యాపారుల అమ్మకాల్లో వాటా (మర్చెంట్ డిస్కౌంట్ రేట్-ఎండీఆర్)గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం 'వ్యక్తుల నుంచి వ్యాపారుల' మధ్య రెండువేల రూపాయలకు మించి జరిగే చెల్లింపులపై ఎండీఆర్ విధించేందుకు రంగం సిద్ధం కావడం చర్చకు దారితీసింది.

### రుసుములతో వచ్చే రాబడి తక్కువే...

స్థూల ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, యూపీఐ నిర్దిష్ట లావాదేవీలపై ఎండీఆర్ విధించకపోవడమే మేలు. ఎందుకంటే- నగదు, చెక్‌ల నుంచి మిత నగదు వ్యవస్థ వైపు మారడం వల్ల సాంప్రదాయిక బ్యాంకింగ్ క్లియరింగ్ సదుపాయాలకయ్యే ఖర్చులు తగ్గుతాయి. అంతే కాకుండా, కరెన్సీకయ్యే వ్యయం, ముఖ్యంగా తక్కువ విలువగల నోట్ల ముద్రణ, నిల్వ, భద్రత, రవాణా, బీమా, వితరణ ఖర్చులను కూడా తగ్గించవచ్చు. రిజర్వ్ బ్యాంక్ నిరుటి వార్షిక నివేదికను బట్టి గత అయిదేళ్లలో నోట్ల ముద్రణా ఖర్చులే 59శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ఆ ఖర్చులతో పోలిస్తే డిజిటల్ చెల్లింపుల వ్యయం ఓ చిన్న భాగం మాత్రమే. దీర్ఘకాల పరిశీలనల ప్రకారం నగదు ఆర్థిక వ్యవస్థ నుంచి డిజిటల్ వ్యవస్థ వైపు మరలే ధోరణి దినదిన ప్రవర్ధమానమవుతోంది. ప్రజల ద్రవ్య నిల్వలు బ్యాంక్ ఖాతాల్లో నిల్వలుగా పరివర్తన చెందడం దేశ రుణ వనరులు పెరగడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని మరింతగా బలపర్చడానికి దోహదం చేస్తుంది. నగదు భౌతిక నిర్వహణ తగ్గడం వల్ల పొదుపయ్యే వేల కోట్ల రూపాయలతో పోలిస్తే, యూపీఐలో జరిగే రెండు వేల రూపాయలకు మించిన వ్యాపారుల లావాదేవీలపై విధించే ఎండీఆర్‌తో వచ్చే రాబడి చాలా తక్కువే.

## శరవేగంగా రాజధాని అమరావతి పనులు - ప్రతి నెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి

మొదటి పేజి తరువాయి

విజయం సాధించారని గుర్తు చేశారు. అమరావతిలో రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం స్పోర్ట్స్ సిటీ, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్డుపై దృష్టి పెట్టామని, 15 రోజుల్లో సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారికి కలిపే మూడో విడత ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభిస్తామని నారాయణ వెల్లడించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించామని, తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఇకపై ప్రతి నెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. "తుళ్లూరు శివాలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. రాజధాని ల్యాండ్ పూలింగ్‌లో తుళ్లూరు రైతులు ఎంతగానో సహకరించారు. రాజధాని రైతుల కుటుంబంలో నేనూ ఒకడిగా ఉండి పూలింగ్ చేశా. ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలు పూర్తిచేసి ప్రభుత్వానికి అందజేస్తాం.




ప్రాజెక్టుల వారీగా రాజధానిలో ల్యాండ్ పూలింగ్ జరుగుతుంది. ప్రస్తుతం స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డుపై దృష్టి పెట్టాం. 15 రోజుల్లో సీడ్ యాక్సెస్ రోడ్డును నేషనల్ హైవేకి కలిపే పనులు ప్రారంభిస్తాం." - నారాయణ, పురపాలక శాఖ మంత్రి పగలు, రాత్రి తేడా లేకుండా పనులు : మరోవైపు అమరావతి నిర్మాణ ప్రాంగణాల్లో ఇప్పుడు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పనులు పరుగులు పెడుతున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో వంద మీటర్ల ఎత్తైన భారీ క్రేన్లు, ఆకాశానికే కాంతి తోరణాలు కడుతున్నట్లుగా కనిపిస్తున్నాయి. జాతరలోని ప్రభలను తలపించే ఈ వెలుగులు రాజధాని పరిధిలోని గ్రామాలకూ స్పష్టంగా కనిపిస్తూ నిర్మాణ జోరును చాటుతున్నాయి. వాతావరణం అనుకూలించడంతో నిర్మాణ సంస్థలు పనుల వేగాన్ని మరింత పెంచాయి. ప్రభుత్వం, సీఆర్‌డీఏ నిర్దేశించిన గడువుల్లో ఐకానిక్ భవనాలను పూర్తి చేయడమే లక్ష్యంగా కాంట్రాక్ట్ సంస్థలు షిఫ్టుల వారీగా పనులు కొనసాగిస్తున్నాయి. జీఏడీ టవర్, నాలుగు హెచ్‌ఓడీ టవర్ల వద్ద రాత్రివేళల్లోనూ భారీ స్థాయిలో పనులు సాగుతుండటంతో అమరావతి ఇప్పుడు 'నిర్మాణ నగరం'గా కళ్లముందు సాక్షాత్కరిస్తోంది. అమరావతి ఐకానిక్ సెక్రటేరియట్ టవర్ల నిర్మాణంలో అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కింద నుంచి పైవరకు ఏడు నుంచి తొమ్మిది డైమండ్ ఆకృతులు వచ్చేలా ప్రత్యేక ఇంజినీరింగ్ డిజైన్‌తో ఈ టవర్లను నిర్మిస్తున్నారు. ఏటవాలుగా ఏర్పాటు చేసే డయాగ్రిడ్ పిల్లర్లు ఒకచోట కలిసి, మళ్లీ విడిపోయి పక్కనున్న పిల్లర్లతో అనుసంధానమవుతూ భవనానికి అపూర్వమైన బలం, రూపాన్ని అందిస్తాయి. ఒక్కో డైమండ్ నిర్మాణాన్ని ఆధారంగా చేసుకుని ఆరు అంతస్తుల చొప్పున నిర్మాణాన్ని పైకి తీసుకెళ్తున్నార.

## కేంద్రం అనుమతి లేక రేవంత్ రెడ్డి రద్దైన అమెరికా పర్యటన

మొదటి పేజి తరువాయి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. నా ఆలోచన అదే : కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను తెలంగాణకు తీసుకొచ్చేందుకే అమెరికా వెళ్లాలని భావించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ స్థాయి విద్యాసంస్థల్లో చదువు, శిక్షణ, స్కిల్స్ నేర్చుకోవాలన్న రాష్ట్ర యువత ఆశలు నెరవేర్చాలని తమ ఉద్దేశం అన్నారు. హార్వర్డ్, ఆక్స్, ఎంఐటీ, ఎల్ బీఎస్, ఎల్ ఎస్ సీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో చదివించేందుకు నాయకులు తమ పిల్లలను పంపిస్తారన్న సీఎం, అలాంటి సంస్థల చదువు, సర్టిఫికెట్లు దేశంలోని సాధారణ ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలనేది తన ఆలోచన అని తెలిపారు.దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు కోసం రాజకీయాలకు ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని తాను విశ్వసిస్తానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉస్మానియా, హెచ్ సీయూ, జేఎన్టీయూ వంటి యూనివర్సిటీలు హైదరాబాద్ ను ఉత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చాయన్నారు. ఒక్క హైదరాబాద్ పబ్లిక్ స్కూలే ఎంతో మంది టెక్ లీడర్లను తయారు చేసి, మనం ప్రపంచాన్ని లీడ్ చేయగలమని నిరూపించిందని సీఎం ప్రస్తావించారు. ఐఐటీ, ఐఎస్ బీ, ట్రిపుల్ ఐటీ, నల్సార్ విద్యాసంస్థలు ప్రముఖ కార్పొరేట్ సంస్థలను, వాటి జీసీలను హైదరాబాద్ కు ఆకర్షించాయన్నారు. ఇప్పుడు ప్రపంచంలోని అత్యుత్తమ విద్య, నైపుణ్య సంస్థలకు గమ్యస్థానంగా హైదరాబాద్ ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నేడు, రేపు బిజీబిజీ : లండన్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. నేడు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సందర్శిస్తారు. సాయంత్రం ఎమిరేట్స్ స్టేడియంలో జరిగే ఈపీఎల్ ఫుట్‌బాల్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి హాజరవుతారు. 22న కేంబ్రిడ్జ్ బృందంతో సమావేశం కానున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను, సాయంత్రం లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శిస్తారు. ఆగస్టు 23న సీఎం లండన్ పర్యటన ముగించుకొని నేరుగా హైదరాబాద్ కు చేరుకుంటారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. విదేశీ పర్యటన సీఎం పదవి ఉద్దేశానికి తగినట్లుగా ఉండాలని,

## హెచ్-1బీలో కొత్త మార్పులు.. వైట్ హౌస్ సమీక్ష పూర్తి!

మొదటి పేజి తరువాయి

తాజాగా హెచ్-1బీ వీసా ఫీజులను మరోసారి పెంచేందుకు ట్రంప్ సర్కారు ప్రయత్నాలు చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. వైట్‌హౌస్‌లోని ఆఫీస్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్ (ఓఐఆర్ఏ) విభాగం ఈ ప్రతిపాదనపై సమీక్ష పూర్తి చేసినట్లు తెలిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఈ ఫీజు పెంపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను మాత్రం ట్రంప్ సర్కారు బహిర్గతం చేయలేదు. ఏ మేరకు ఫీజులు పెంచుతారన్నదాని గురించి ఎలాంటి వివరాలు బయటకురాలేదు. ఏయే రకాల హెచ్-1బీ వీసా పిటిషన్లకు ఈ ఫీజు పెంపు వర్తిస్తుందనేది కూడా ఇంకా తెలియరాలేదు. రాబోయే వారాల్లో డీహెచ్ఎస్ స్వయంగా ఈ ప్రతిపాదనను బహిరంగ పరచనుంది. అనంతరం ప్రజల





అభ్యంతరాలు స్వీకరించి ఆపై తుది నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది.ఓఐఆర్ఏ సమీక్ష పూర్తైనంత మాత్రాన ఫీజుల పెంపునకు అనుమతి లభించినట్టు కాదని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనను, ప్రజల ముందు పెట్టాక వారి అభిప్రాయాల ఆధారంగా డీహెచ్ఎస్ తుది నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్నారు. హెచ్-1బీ వీసా ఫీజు పెంపుపై కోర్టులో చుక్కెదురైనా వెనక్కు తగ్గని ట్రంప్ సర్కారు ఇటీవల 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఫీజులను పెంచిన విషయం తెలిసిందే. హెచ్-1బీ, ఎల్-1 వీసా పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకునే కొన్ని సంస్థలపై ట్రంప్ సర్కారు ఈ అదనపు భారం మోపింది. ఇవే కాకుండా, వీసా స్పాన్సర్ చేసే సంస్థలపై నిఘా మరింత కట్టుదిట్టం చేసేలా హెచ్-1బీ వీసాకు మరిన్ని మార్పులు చేసే యోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.2025 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ప్రభుత్వం 4,06,348 హెచ్-1బీ వీసా పిటిషన్లను ఆమోదించింది. వీటిలో 2,91,542 పిటిషన్లు వీసా పొడిగింపునకు సంబంధించినవి. ఇందులో భారతీయుల పిటిషన్ల వాటా 77.6 శాతం. ఈ నేపథ్యంలో మరోసారి వీసా ఫీజులు పెరిగితే భారతీయ ఉద్యోగులు అధికంగా ఉన్న టెక్ కంపెనీలకు ఖర్చుల భారం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

## ప్రతీ రూపాయి రైతుల ఖాతాల్లోకి చేరాల్సిందే

మొదటి పేజి తరువాయి

పురోగతికి అడ్డంకిగా మారిన భూసేకరణ, పునరావాసం-పునర్నిర్మాణం(ఆర్ అండ్ ఆర్), అటవీ అనుమతులు తదితర సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరి ంచేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవసరమైన పత్రాలు, లబ్ధిదారుల వివరాలు పూర్తిగా ఉన్నచోట ఒకటి రెండు రోజుల్లోనే పరిహారం రైతులు, నిర్వాసితుల ఖాతాల్లో జమ కావాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ భూములకు సంబంధించిన చెల్లింపులు తదితర సమస్యలు అడ్డంకిగా ఉండకూడదన్నది ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టమైన సంకల్పమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి రూ.5 వేల కోట్లను కేటాయించారని తెలిపారు. ఇంత పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం సమకూర్చినప్పుడు ఆ నిధులు బాధితులకు చేరేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. 'నిధులను కలెక్టర్ల పీడీ ఖాతాల్లో జమ చేయడంతో ప్రభుత్వ బాధ్యత పూర్తయినట్లు కాదు.. ఆ డబ్బు భూమి ఇచ్చిన రైతుకు, నిర్వాసిత కుటుంబానికి చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.. మంజూరు నుంచి లబ్ధిదారుడి ఖాతాలో జమయ్యే వరకు ఉన్న ప్రతి అనవసర పరిపాలనా అడ్డంకినీ తొలగించాలి' అని ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ తదితర అవసరాల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,782 కోట్లు విడుదల చేయగా సుమారు రూ.566 కోట్లు లబ్ధిదారులకు చేరాయని సమీక్షలో వెల్లడైంది. మరో రూ.989 కోట్లు వివిధ దశల్లో చెల్లింపుల ప్రక్రియలో ఉండగా రూ.199 కోట్లు జిల్లాల వద్ద అందుబాటులో ఉన్నప్పటికీ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉందని అధికారులు వివరించారు. ఈ ప్రకారం దాదాపు రూ.1,200 కోట్లను తక్షణమే లేదా స్వల్ప పరిపాలనా ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే అవకాశం ఉందని, ఈ మొత్తాన్ని రైతులు, నిర్వాసితుల ఖాతాల్లోకి చేర్చడాన్ని అత్యవసర కార్యక్రమంగా చేపట్టాలని కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అదనంగా సుమారు రూ.455 కోట్లకు సంబంధించిన టోకెన్లు క్లియర్ అయి తదుపరి ప్రక్రియలో ఉన్నాయని వెల్లడైంది. విడుదలైన నిధులకు, రైతులకు జరిగిన వాస్తవ చెల్లింపులకు మధ్య ఉన్న అంతరాన్ని రోజూ పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ల పీడీ ఖాతాల్లోకి డబ్బులు వచ్చిన తరువాతే భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టాలనే పద్ధతికి స్వస్తి పలకాలని మంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియ, కన్సెంట్ అవార్డులు, అవార్డు నంబర్లు, టోకెన్ల జనరేషన్ వంటి ప్రక్రియలన్నింటినీ ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అవార్డు నంబర్లు, టోకెన్ వివరాలు సిద్ధమైన వెంటనే అవసరమైన నిధుల విడుదల కోసం నీటిపారుదల శాఖ ఆర్థిక శాఖతో సమన్వయం చేస్తుందని తెలిపారు.



### వారం రోజుల సమయం కుదరదు

జగిత్యాల జిల్లాలో భూసేకరణ కోసం ఇప్పటికే జమ చేసిన నిధులను ఒకటి రెండు రోజుల్లోనే పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందుకు వారం రోజుల సమయం కావాలన్న అధికారుల అభ్యర్థనను ఆయన అంగీకరించలేదు. నిధులు అందుబాటులో ఉండి లబ్ధిదారుల వివరాలు సిద్ధంగా ఉన్నప్పుడు పరిహారం చెల్లింపును వారం రోజులపాటు నిలిపివేయడానికి కారణం ఉండదని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్ ఫీడర్ కెనాల్‌తోపాటు ఇతర పనులకు అవసరమైన సుమారు 180 ఎకరాల భూసేకరణకు సంబంధించిన కన్సెంట్ అవార్డులను మొత్తం ఆర్థిక ప్రక్రియ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌పై ప్రత్యేక సమీక్ష

మహబూబాబాద్ జిల్లాలోని మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ భూసేకరణ అంశాన్ని కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. రైతులతో జరిగిన చర్చలకు అనుగుణంగా కన్సెంట్ అవార్డులు, సవరించిన పరిహార అంచనాలను వేగంగా పూర్తి చేయాలని, భూసేకరణ సమస్యల కారణంగా ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకూడదని స్పష్టం చేశారు. అటవీ అనుమతులకు సంబంధించిన అడ్డంకులపైనా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. శాఖల మధ్య సమన్వయ లోపం లేదా అవసరమైన సమాచారం అందించడంలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోవడానికి వీల్లేదన్నారు. జిల్లా కలెక్టర్లు రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తోపాటు ఇతర నీటిపారుదల పథకాలకు సంబంధించిన అటవీ సమస్యలను సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షించారు. భూసేకరణ, ఆ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 'ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతు పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకూడదు.. ప్రభుత్వం వద్ద నిధులున్నప్పుడు పరిపాలనా జాప్యం కారణంగా బాధితుడు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండొద్దు.. ప్రాజెక్టు ముందుకు సాగాలి.. రైతుకు న్యాయం జరగాలి -రెండూ ఒకేసారి సాధించాలి' అని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఇంజనీర్-ఇన్-చీఫ్(జనరల్) ఓ.వి.రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఈఎన్‌సీ(అడ్మినిస్ట్రేషన్) టి.శ్రీనివాస్,

## అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు భారత్‌ను ప్రపంచ కేంద్రంగా మార్చాలి: స్పేస్ స్టార్టప్‌లకు మోదీ పిలుపు

వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌లను కోరారు. అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు దేశాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చాలని అన్నారు. శుక్రవారం నాడు సేవా తీర్థ్ (పీఎం కార్యాలయం)లో 20 స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ మేరకు భారత అంతరిక్ష రంగం గురించి మోదీ వ్యాఖ్యానించారు.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు : మోదీ

యువ అంతరిక్ష పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశు సంపద నిర్వహణ, పాడి, పర్యావరణం, ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇతర రంగాలలో అంతరిక్ష సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులను కోరారు. స్పేస్ స్టార్టప్‌ల వంటి కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి రిస్క్‌లు తీసుకున్నందుకు వారిని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించడానికి అంతరిక్ష సంస్థలు, ఇతర రంగాల సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని పిలుపునిచ్చారు.

కొన్ని దేశాలు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టట్లేదు : మోదీ

"ప్రపంచం అంతరిక్షం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసే ఒక ఎకో సిస్టమ్‌ను సృష్టించాలి. ప్రపంచవ్యాప్త ప్రతిభను, కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షించడానికి దేశ అంతరిక్ష రంగం ఒక అయస్కాంతంలా పనిచేయగలదు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించడం పట్ల ప్రభుత్వానికి దార్శనికత ఉంది. ఒక కొత్త రంగాన్ని ముందుండి నడిపించినందుకు స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, ఫౌండర్స్‌కు అభినందనలు. అనేక దేశాలు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టలేకపోతున్నాయి. కొన్ని దేశాలు ఇన్వెస్ట్ చేయడానికి ఇష్టపడటం లేదు. ఇది ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశానికి తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పిస్తోంది. చిన్న వయసు నుంచే పిల్లలలో అంతరిక్షం పట్ల జిజ్ఞాస, ఆసక్తిని పెంపొందించడానికి అంతరిక్ష సంస్థలు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మధ్య మరింత సన్నిహిత సహకారం ఉండాలి. "

- నరేంద్ర మోదీ, భారత ప్రధాని

భారత అంతరిక్ష రంగ యువ కెరటాలను కలవడం అద్భుతంగా ఉందన్నారు మోదీ. "ఒక కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించిన యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు వీరు. వారు రిస్కులు తీసుకున్నారు, సంస్కరణల ప్రక్రియను విశ్వసించారు. తమ ప్రయత్నాలలో నిలకడగా ఉన్నారు. దీని కారణంగా గత కొన్నేళ్లుగా అంతరిక్ష రంగంలో భారత్ ఎంతో సాధించింది. స్టార్టప్‌లు తమ పనిపై విశ్లేషణాత్మక ప్రజెంటేషన్లు ఇచ్చాయి. భవిష్యత్ కోసం దేశ సామర్థ్యాలను

ట్రై నెట్ న్యూస్
నిజం • నిర్భయం • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

శనివారం ,ఆగస్టు ,22, 2026

www.trinetnews.com

# తిరుమల అడవుల్లోకి 'రోబో డాగ్'.. భక్తుల భద్రతకు టీటీడీ హైటెక్ సొల్యూషన్!

## తిరుమలలో వన్యప్రాణుల కదలికల పర్యవేక్షణకు రోబో డాగ్

మొదటి పేజీ తర్వాత.

భక్తుల భద్రతను పటిష్టం చేసేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికత పరిశీలన అడవుల్లోకి మనుషులు వెళ్లలేని చోట రోబోలతో నిఘా పెట్టే యోచన చిరుతల సంచారాన్ని గుర్తించి కంట్రోల్ రూమ్‌కు లైవ్ వీడియో, అలర్ట్స్
శబ్దాలు, కాంతితో జంతువులను తిరిగి అడవిలోకి పంపే సౌకర్యం శేషాచలం అడవుల్లో వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించడం, భక్తుల భద్రతను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, ప్రమాదకరమైన అటవీ ప్రాంతాల్లో మనుషులకు బదులుగా నిఘా పెట్టేందుకు 'క్వాడ్రుపెడ్ రోబోట్' (నాలుగు కాళ్ల రోబో డాగ్) వినియోగంపై దృష్టి సారించింది. గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహం వద్ద ఈ రోబో డాగ్ పనితీరును టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఇతర అటవీ, భద్రతా విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా మనుషులు సులభంగా వెళ్లలేని, ప్రమాదకరమైన కొండ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారాన్ని గుర్తించడానికి ఈ రోబోట్‌ను ఎలా ఉపయోగించవచ్చో అడిగి తెలుసుకున్నారు.

**రోబో ప్రత్యేకతలు ఇవే..**

ఈ రోబో డాగ్ అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తుంది. ఇందులో ఆప్టికల్ కెమెరా, థర్మల్ ఇమేజింగ్ కెమెరా, 360 డిగ్రీల లైడార్ సెన్సార్ వంటివి ఉన్నాయి. వీటి సహాయంతో చిమ్మచీకటిలో, దట్టమైన పొగమంచులో కూడా వన్యప్రాణుల కదలికలను స్పష్టంగా గుర్తించవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థ సాయంతో ఇది జంతువులు, మనుషులు, వాహనాలను వేర్వేరుగా గుర్తుపట్టగలదు.

భక్తులకు భద్రత ఎలా?

గతంలో అలిపిరి-తిరుమల నడక మార్గాల్లో చిరుతల సంచారం భక్తులను ఆందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నడకదారికి సమీపంలోని అటవీ ప్రాంతాల్లో చిరుత లేదా ఇతర జంతువుల కదలికలను ఈ రోబో గుర్తించిన వెంటనే, జియో-ట్యాగ్‌తో కూడిన హెచ్చరికను కంట్రోల్ రూమ్‌కు పంపుతుంది. అదే సమయంలో లైవ్ వీడియో, థర్మల్ ఫీడ్‌ను భద్రతా సిబ్బందికి చేరవేస్తుంది. దీంతో వారు వెంటనే స్పందించి భక్తులను అప్రమత్తం చేయడానికి వీలవుతుంది.

అంతేకాకుండా, వన్యప్రాణులు భక్తులు తిరిగే ప్రాంతాల వైపు వస్తుంటే, రోబోట్‌లోని సౌండ్, లైట్ యూనిట్లను ఉపయోగించి వాటిని భయపెట్టి, ఎలాంటి హాని తలపెట్టకుండా తిరిగి అడవిలోకి పంపే అవకాశాలను కూడా అధికారులు పరిశీలించారు. ఇది మనుషులు-వన్యప్రాణుల మధ్య ఘర్షణను నివారిస్తుంది.

ఈ రోబోటిక్ వ్యవస్థను ఇప్పటికే ఉన్న కెమెరా ట్రాప్‌లు, ఫుట్ పెట్రోలింగ్‌కు ప్రత్యామ్నాయంగా కాకుండా, వాటికి అదనపు బలంగా వినియోగించాలని టీటీడీ భావిస్తోంది. అవసరాన్ని బట్టి, జంతువుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దీన్ని మొబైల్ మానిటరింగ్ యూనిట్‌గా మోహరించనున్నారు. దీని ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, వన్యప్రాణుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో భద్రతా చర్యలను మరింత మెరుగుపరచవచ్చని అధికారులు తెలిపారు.

# అమెరికా పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనుమతి నిరాకరణ

## కేంద్ర నిర్ణయంతో అమెరికా పర్యటన రద్దు -- లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

ట్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేపట్టిన విదేశీ పర్యటనలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తొలుత పది రోజుల పాటు బ్రిటన్, అమెరికా దేశాల్లో పర్యటించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి, ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్నారు. అయితే అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో ఆయన అమెరికా పర్యటనను రద్దు చేసుకుని లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించినట్లు తాజా సమాచారం వెల్లడిస్తోంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 20వ తేదీన ఢిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరారు. ఆయన పర్యటనలో భాగంగా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ బిజినెస్ స్కూల్ వంటి ప్రముఖ విద్యాసంస్థలను సందర్శించాల్సి ఉంది. అనంతరం అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాల్సిన కార్యక్రమం రూపొందించారు.

**కేంద్ర అనుమతిపై అనూహ్య మలుపు**

అమెరికా పర్యటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అనుమతిని కోరినప్పటికీ, బ్రిటన్ పర్యటనకు మాత్రమే అనుమతి లభించిందని సమాచారం. అమెరికా పర్యటనకు అనుమతి రాకపోవడంతో ముఖ్యమంత్రి తన పర్యటన ప్రణాళికను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికాలో ముఖ్యమంత్రి పాల్గొనాల్సిన అధికారిక కార్యక్రమాలను అధికారులు కొనసాగించాలని, విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్య ఒప్పందాల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి.

**విద్యారంగ అభివృద్ధే ప్రధాన లక్ష్యం**

అమెరికా పర్యటన వెనుక ప్రధాన ఉద్దేశం తెలంగాణలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలతో తెలంగాణకు సంబంధాలు ఏర్పరచి, రాష్ట్రంలోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది.

హార్వర్డ్, ఎంఐటీ తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పడితే తెలంగాణ యువతకు విద్య, పరిశోధన, నైపుణ్య శిక్షణ రంగాల్లో కొత్త అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

**లండన్ పర్యటన కొనసాగింపు**

అమెరికా పర్యటన రద్దయినప్పటికీ లండన్‌లో ముఖ్యమంత్రి చేపట్టాల్సిన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆగస్టు 21న ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ పరిధిలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సందర్శించే కార్యక్రమం ఉంది. అనంతరం క్రీడా రంగానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆగస్టు 22న కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సమావేశంతో పాటు లండన్ విశ్వవిద్యాలయం, లండన్ బిజినెస్ స్కూల్ వంటి సంస్థలను సందర్శించే కార్యక్రమాలు ఉన్నాయి.

**రాజకీయ చర్చకు దారితీసిన నిర్ణయం**

ముఖ్యమంత్రి అమెరికా పర్యటన రద్దు కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. సాధారణంగా ముఖ్యమంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లేటప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అనుమతులు, భద్రతా అంశాలు, అధికారిక విధానాలను అనుసరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణకు సంబంధించిన కారణాలపై రాజకీయంగా వివిధ అభిప్రాయాలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది.



అయితే ఈ పరిణామాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూడకుండా, రాష్ట్ర ప్రయోజనాల దృష్టితో చూడాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలతో సంబంధాలు ఏర్పరచుకోవడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, విద్యా భాగస్వామ్యాలు, పరిశోధనా అవకాశాలు లభించే అవకాశం ఉంటుంది.

**అధికారులను అమెరికాకు పంపే నిర్ణయం**

ముఖ్యమంత్రి అమెరికా పర్యటన రద్దయినా, అక్కడ నిర్వహించాల్సిన అధికారిక కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోకుండా అధికారులు ముందుకు సాగాలని రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రముఖ విద్యాసంస్థలతో ప్రతిపాదించిన అవగాహన ఒప్పందాలను పూర్తి చేయాలని ఆయన ఆదేశించినట్లు వెల్లడైంది.

ఇది ప్రభుత్వ పరిపాలనా దృక్పథంలో ఒక ముఖ్యమైన అంశంగా చెప్పవచ్చు. ముఖ్యమంత్రి స్వయంగా హాజరు కాలేకపోయినా, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన చర్చలు, ఒప్పందాలు కొనసాగించాలన్న ఉద్దేశం ఇందులో కనిపిస్తోంది.

**యువతకు అవకాశాలే లక్ష్యం**

తెలంగాణలోని యువతకు ప్రపంచ స్థాయి విద్య, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య శిక్షణ అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి పేర్కొంటున్నారు. విదేశీ పర్యటన ద్వారా ఈ లక్ష్యానికి అనుగుణంగా ప్రముఖ విద్యాసంస్థలతో సంబంధాలు పెంచుకోవాలని ప్రభుత్వం భావించింది.

అమెరికా పర్యటన రద్దు కావడం తాత్కాలికంగా ఒక ఆటంకంగా కనిపించినప్పటికీ, ఇప్పటికే ప్రారంభమైన చర్చలను అధికారులు కొనసాగిస్తే భవిష్యత్తులో తెలంగాణకు విద్యా, సాంకేతిక రంగాల్లో ప్రయోజనాలు లభించే అవకాశం ఉంది.

**కేంద్ర--రాష్ట్ర సంబంధాలపై ప్రభావం?**

అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ అంశం కేంద్ర--రాష్ట్ర సంబంధాలపై కూడా రాజకీయ చర్చకు దారితీయవచ్చు. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల మధ్య ఇప్పటికే రాజకీయ విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం మరో అంశంగా మారే అవకాశం ఉంది.

అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు, విద్యా రంగ పురోగతిని రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం.

మొత్తంగా చూస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన బ్రిటన్--అమెరికా పది రోజుల పర్యటనలో అమెరికా భాగం అనూహ్యంగా రద్దయింది. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రి లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తాజా సమాచారం. అదే సమయంలో అమెరికాలో జరగాల్సిన విద్యా, సాంకేతిక భాగస్వామ్య చర్చలను అధికారులు కొనసాగించనున్నారు.

అమెరికా పర్యటన రద్దు రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుంది? తెలంగాణ విద్యా రంగానికి ప్రతిపాదించిన అంతర్జాతీయ భాగస్వామ్యాలు ఏ మేరకు ముందుకు సాగుతాయి? కేంద్ర--రాష్ట్ర సంబంధాలపై ఈ పరిణామం ఎలాంటి ప్రభావం చూపుతుంది? అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# కుమార్తె వ్యాఖ్యల వివాదం

## సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మాట్లాడతానన్న కొండా సురేఖ

మొదటి పేజీ తర్వాత...

**క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చానన్న కొండా సురేఖ**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చాకే పూర్తి వివరాలు వెల్లడిస్తానని స్పష్టీకరణ**

**కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని ఇప్పటికే లేఖలో పేర్కొన్న మంత్రి**

.ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎం, కాంగ్రెస్ అధిష్ఠానం



తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ విషయంపై తాను చెప్పాల్సింది ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరించానని, ప్రస్తుతం మీడియా ముందు మాట్లాడేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై స్పందిస్తానని ఆమె తెలిపారు.

వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన విమర్శలపై పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై సురేఖ ఇప్పటికే కమిటీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని ఆమె ఆ లేఖలో కోరినట్లు సమాచారం.

అయితే, ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వర్గాల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. కేవలం నోటీసులతోనే సరిపెట్టకుండా, క్రమశిక్షణా చర్యలు మరింత కఠినంగా ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# నాలుగు రోజుల ఏపీ అసెంబ్లీ సమావేశాలు ముగింపు

## 12 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం -- 25 గంటలకు పైగా సాగిన శాసన కార్యక్రమాలు

ట్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

ఆంధ్రప్రదేశ్ శాసనసభ నాలుగు రోజుల వర్షాకాల సమావేశాలు గురువారం ముగిశాయి. సభాపతి చింతకాయలఅయ్యన్నపాత్రుడుసభను నిరవధికంగా వాయిదా వేశారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో మొత్తం 25 గంటల 15 నిమిషాల పాటు సభా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కాలంలో ప్రభుత్వం పలు కీలక అంశాలపై చర్చలు చేపట్టడంతో పాటు 12 బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఒక బిల్లును ఉపసంహరించుకుంది.

**12 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం**

ఈ సమావేశాల ప్రధాన ప్రత్యేకత 12 బిల్లులకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం. విద్య, నైపుణ్యాభివృద్ధి, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర రంగాలకు సంబంధించిన కీలక మార్పులకు ఈ బిల్లులు మార్గం సుగమం చేయనున్నాయి.

ముఖ్యంగా ఉన్నత విద్యా రంగానికి సంబంధించి నాలుగు కీలక బిల్లులు సభ ఆమోదం పొందాయి. ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, నైపుణ్య విశ్వవిద్యాలయాల ఏర్పాటు, ఉన్నత విద్యా నియంత్రణ వ్యవస్థలో మార్పులు, ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి.

**విద్యా రంగానికి కొత్త దిశ**

రాష్ట్రంలో ఉన్నత విద్యను మరింత బలోపేతం చేయడం, యువతకు ఉపాధి అవకాశాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడం లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, నియంత్రణకు సంబంధించిన సవరణలతో పాటు రాష్ట్ర ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల ఏర్పాటు బిల్లును సభ ఆమోదించింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయడం ద్వారా విద్యా రంగంలో దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు అవకాశం కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా వెల్లడైంది. అలాగే రాష్ట్ర విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించిన బిల్లుకు కూడా ఆమోదం లభించింది. తొలి దశలో 1,523 విశ్వవిద్యాలయ అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ చట్టపరమైన మార్గం ఉపయోగపడనుంది.

మేయర్లు, పురపాలక చైర్‌పర్సన్లకు ప్రత్యక్ష ఎన్నికలు స్థానిక సంస్థల పాలనలో కూడా కీలక మార్పుకు ఈ సమావేశాలు వేదికగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టాల నాలుగో సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

ఈ సవరణ ద్వారా నగరపాలక సంస్థల మేయర్లు, పురపాలక సంఘాల చైర్‌పర్సన్లు, నగర పంచాయతీల అధ్యక్షులను ప్రజలు నేరుగా ఎన్నుకునే విధానాన్ని తిరిగి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో రాష్ట్రంలో ప్రత్యక్ష ఎన్నికల విధానం అమలులో ఉండగా, అనంతరం పరోక్ష ఎన్నికల విధానం కొనసాగింది. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది.



ప్రజలు నేరుగా తమ నగర పాలక నాయకులను ఎన్నుకోవడం వల్ల పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ప్రజలకు నేరుగా జవాబుదారీతనం పెరగడానికి అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**ప్రశ్నోత్తరాలకు ప్రాధాన్యం**

నాలుగు రోజుల సమావేశాల్లో సభ్యులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 40 నక్షత్ర గుర్తు ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. మరో 25 నక్షత్ర గుర్తు ప్రశ్నలకు, ఒక నక్షత్ర గుర్తు లేని ప్రశ్నకు సంబంధించిన సమాధానాలను సభ పీఠంపై ఉంచారు. ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాలపై సభ్యులు ప్రశ్నలు అడిగారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రులు సంబంధిత శాఖల వివరాలను సభకు వివరించారు.

**మూడు స్వల్పకాలిక చర్చలు**

సభలో మూడు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. వివిధ ప్రజా ప్రాధాన్యత అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఒక మంత్రి నియమం 344 కింద వేర్వేరు అంశాలపై ప్రకటనలు చేశారు.

చివరి రోజు కార్యక్రమాల్లో ప్రత్యేకంగా రెండు గంటల పాటు శూన్యకాలాన్ని నిర్వహించారు. ఎక్కువ మంది సభ్యులకు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించేందుకు ఈ సమయాన్ని పొడిగించారు. అనంతరం ప్రశ్నోత్తరాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన 'సూపర్ సిక్స్' అంశంపై స్వల్పకాలిక చర్చ జరిగింది.

**నీటి కాలుష్య నియంత్రణ చట్టానికి ఆమోదం**

సమావేశాల చివరి రోజున నీటి కాలుష్య నియంత్రణకు సంబంధించిన కేంద్ర సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. నీటి వనరుల పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, పర్యావరణ రక్షణ వంటి అంశాల నేపథ్యంలో ఈ నిర్ణయానికి ప్రాధాన్యం ఉంది.

రాష్ట్రంలో పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామిక కార్యకలాపాల నేపథ్యంలో నీటి వనరుల పరిరక్షణ మరింత కీలకంగా మారింది. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నీటి వనరులను అందుబాటులో ఉంచేందుకు చట్టపరమైన చర్యలు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సభ్యుల విస్తృత భాగస్వామ్యం**

నాలుగు రోజుల సమావేశాల్లో మొత్తం 103 మంది శాసనసభ్యులు వివిధ అంశాలపై చర్చల్లో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. సభలో తెలుగుదేశం పార్టీకి 135 మంది, జనసేనకు 21 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది, భారతీయ జనతా పార్టీకి 8 మంది సభ్యులు ఉన్నట్లు సభాపతి ప్రకటించారు.

పార్టీల మధ్య రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ పలు బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం లభించడం సమావేశాల ప్రత్యేకతగా నిలిచింది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో అన్ని పార్టీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది.

**రైతులు, సంక్షేమంపై చర్చ**

సభా కార్యక్రమాల్లో రైతులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. రైతులు పంటల బీమా పథకంలో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయడం, అర్హులైన వారికి ప్రయోజనాలు అందించడం వంటి అంశాలపై సభ్యులు చర్చించారు.

ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా అన్నదానిపై శాసనసభలో చర్చ జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన అంశంగా చెప్పవచ్చు.

**ముగిసిన సమావేశాలు -- ముందున్న బాధ్యత**

నాలుగు రోజులపాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. 25 గంటల 15 నిమిషాల సభా కార్యకలాపాల్లో 12 బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం, మూడు స్వల్పకాలిక చర్చలు జరగడం, ప్రశ్నోత్తరాల ద్వారా ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం సమావేశాల ముఖ్యాంశాలుగా నిలిచాయి. ఒక బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఒక ప్రభుత్వ తీర్మానానికి సభ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఒక కమిటీ నివేదికను కూడా సభకు సమర్పించి ఆమోదించింది.

శాసనసభ ఆమోదించిన బిల్లులు కేవలం చట్టపరమైన మార్పులకే పరిమితం కాకుండా ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే విధంగా అమలు కావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ముఖ్యంగా విద్య, నైపుణ్యాభివృద్ధి, స్థానిక సంస్థల పాలన, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో తీసుకున్న నిర్ణయాలు ఆచరణలో ఎంతవరకు ఫలితాలు ఇస్తాయన్నది భవిష్యత్తులో తేలనుంది.

మొత్తంగా చూస్తే నాలుగు రోజుల ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు తక్కువ వ్యవధిలోనే గణనీయమైన శాసన కార్యక్రమాలను పూర్తి చేశాయి. 12 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం లభించడం ఈ సమావేశాల ప్రధాన ఘట్టంగా నిలిచింది. ప్రజా సమస్యలపై చర్చలు, కొత్త చట్టాలకు ఆమోదం, ప్రభుత్వ విధానాలపై సమీక్షతో సమావేశాలు ముగిశాయి.

# అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలువిరజిల్లా

## ఉజ్వల సంస్థ అధ్యక్షురాలు ఎం. లక్ష్మి



రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21:

పవిత్రమైన వరలక్ష్మీ వ్రతం పండగ సందర్భంగా అంబర్ పేట్ లో నియోజకవర్గంలో ఆలయాలు కిక్కిరి సాయి. మహిళలు ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్వల సంస్థ అధ్యక్షురాలు ఎం. లక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి ఏటా వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వరలక్ష్మీ అమ్మవారి దివ్య కృపాకటాక్షాలతో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ధనసంపదలు ఎల్లప్పుడూ వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

# మంత్రి కొండా సురేఖ రాజీనామా చేయాలంటూ డిమాండ్

## తెలంగాణ కాంగ్రెస్‌లో ముదురుతున్న అంతర్గత విభేదాలు

ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21 :

తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి కొండా సురేఖ కుటుంబం చుట్టూ రాజకీయ వివాదం మరింత ముదురుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష వర్గాలు, రాజకీయ ప్రత్యర్థులు డిమాండ్ చేస్తున్నాయి. అయితే తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేయడం ఈ వ్యవహారానికి మరో మలుపు తీసుకొచ్చింది.



**కుమార్తె వ్యాఖ్యలతో వివాదం**

ఇటీవల పరకాల నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుష్మిత తీవ్రస్థాయిలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని, పార్టీ అధిష్ఠానం టికెట్ ఇచ్చినా ఇవ్వకపోయినా తన నిర్ణయంలో మార్పు ఉండదని ఆమె ప్రకటించారు. అంతేకాకుండా ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రాజీనామా చేసి ఉపఎన్నికకు రావాలని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా తాను విజయం సాధిస్తానని ఆమె వ్యాఖ్యానించడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర కలకలం రేపింది.

ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలుగా కొందరు భావించినప్పటికీ, మంత్రి కుటుంబానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిని, అధికార పార్టీ నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం పార్టీ అంతర్గత క్రమశిక్షణపై చర్చకు దారితీసింది.

**కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసు**

సుష్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ స్పందించింది. మంత్రి కొండా సురేఖకు వివరణ కోరుతూ కారణం చూపు నోటీసు జారీ చేసినట్లు సమాచారం. పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యులు పార్టీ నాయకత్వంపై బహిరంగంగా విమర్శలు చేయడం పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగించే అంశంగా పరిగణించినట్లు వార్తలు వెలువడ్డాయి. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం.

దీనికి స్పందించిన కొండా సురేఖ, తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని స్పష్టం చేశారు. వాటికి తాను బాధ్యురాలిని కాదని, అలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కూడా పేర్కొన్నట్లు సమాచారం.

**రాజీనామా డిమాండ్ ఎందుకు?**

మంత్రి పదవిలో ఉన్న నాయకుల కుటుంబ సభ్యులు అధికార పార్టీ నాయకత్వాన్ని బహిరంగంగా సవాలు చేయడం రాజకీయంగా అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు పార్టీ అంతర్గత వ్యవహారాలను బహిర్గతం చేశాయని విమర్శలు వస్తున్నాయి.

మంత్రి కొండా సురేఖ కుటుంబానికి పరకాల రాజకీయాల్లో ఉన్న ఆసక్తి, వచ్చే ఎన్నికల్లో తమ కుటుంబం నుంచి అభ్యర్థిత్వం కోరుతున్న అంశం ఈ వివాదానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల పరకాల సభలో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డే మరోసారి పోటీ చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడం కూడా ఈ పరిణామాలకు నేపథ్యంగా నిలిచిందనే చర్చ జరుగుతోంది.

**కాంగ్రెస్‌లో అంతర్గత పోరు**

తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా అంతర్గత విభేదాలు ఉన్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మంత్రి కొండా సురేఖకు, కొందరు స్థానిక నాయకులకు మధ్య విభేదాలు ఉన్నట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇలాంటి సమయంలో ఆమె కుటుంబం నుంచి ముఖ్యమంత్రి, పార్టీ నాయకత్వాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు రావడంతో పరిస్థితి మరింత సున్నితంగా మారింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఇటీవల పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు ఇష్టానుసారం మాట్లాడటం సరికాదని, ఏమైనా సమస్యలు ఉంటే తనతో నేరుగా మాట్లాడాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొండా కుటుంబ వ్యవహారం కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అంశాన్ని మరోసారి ముందుకు తెచ్చింది.

**ప్రతిపక్షాలకు రాజకీయ అవకాశం**

అధికార కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ప్రతిపక్ష పార్టీలకు రాజకీయంగా అనుకూలంగా మారుతున్నాయి. ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి కుటుంబం నుంచే ముఖ్యమంత్రి, పార్టీ నాయకత్వంపై విమర్శలు రావడం ద్వారా కాంగ్రెస్‌లో నాయకత్వ సంక్షోభం ఉందని ప్రతిపక్షాలు ప్రచారం చేసే అవకాశం ఏర్పడింది.

ఇదే సమయంలో కొందరు రాజకీయ నాయకులు మంత్రి కొండా సురేఖ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పదవిలో కొనసాగుతూ పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన వివాదం కొనసాగడం సరికాదని వారు అంటున్నారు. అయితే ఇది ప్రధానంగా రాజకీయ డిమాండ్ మాత్రమేనని, రాజీనామాపై ప్రభుత్వం లేదా కాంగ్రెస్ అధిష్ఠానం అధికారిక నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమైన సమాచారం లేదు.

**మంత్రి భవిష్యత్తుపై ఉత్కంఠ**

ప్రస్తుతం ప్రధానంగా మూడు అంశాలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. మొదటిది---కొండా సురేఖ ఇచ్చిన వివరణను పార్టీ క్రమశిక్షణ కమిటీ ఎలా పరిగణిస్తుంది? రెండవది---కుటుంబ సభ్యుల రాజకీయ వ్యాఖ్యలపై పార్టీ మరింత కఠిన చర్యలు తీసుకుంటుందా? మూడవది---కొండా కుటుంబం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్య ఏర్పడిన రాజకీయ దూరం భవిష్యత్తులో ఎలా మారుతుంది?

కొండా సురేఖ తన కుమార్తె వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కాదని స్పష్టం చేసిన నేపథ్యంలో, ఆమెపై పార్టీ ఎలాంటి చర్య తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మరోవైపు పరకాల రాజకీయాల్లో తమ కుటుంబ భవిష్యత్తుపై కొండా కుటుంబం ఏ వ్యూహాన్ని అనుసరిస్తుందన్నది కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

**ముగింపు**

కొండా సురేఖ రాజీనామా చేయాలనే డిమాండ్ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో మరో చర్చకు తెరతీసింది. ఒకవైపు మంత్రి తనకు సంబంధం లేని వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కాదని వివరణ ఇస్తుండగా, మరోవైపు ప్రతిపక్షాలు ఆమెను నైతిక బాధ్యత వహించాలని కోరుతున్నాయి.

అయితే రాజకీయాల్లో వ్యక్తిగత వ్యాఖ్యలు, కుటుంబ రాజకీయాలు, పార్టీ క్రమశిక్షణ, అధిష్ఠానం నిర్ణయాలు పరస్పరం కలిసిపోయినప్పుడు పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారుతాయి. కొండా సురేఖ విషయంలో కాంగ్రెస్ నాయకత్వం తీసుకునే తదుపరి నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. ప్రస్తుతం రాజీనామా డిమాండ్ రాజకీయంగా బలంగా వినిపిస్తున్నప్పటికీ, మంత్రి పదవిపై తుది నిర్ణయం మాత్రం కాంగ్రెస్ అధిష్ఠానం మరియు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరిపైనే ఆధారపడి ఉంటుంది.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే

## పేద కుటుంబాలకు ఊహించని ఎదురుదెబ్బ -- నిధుల చెల్లింపులు తాత్కాలికంగా నిలిపివేత

ట్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

తెలంగాణలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక భరోసాగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర స్టే విధించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వివాహం చేసుకునే అర్హులైన యువతులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ రెండు పథకాల అమలుకు సంబంధించి గతంలో జారీ చేసిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల అమలుపైనా కోర్టు స్టే విధించింది. తదుపరి విచారణ వరకు లబ్ధిదారులకు ఈ పథకాల కింద ఎలాంటి చెల్లింపులు చేయవద్దని ఆదేశించింది.



**ఎందుకు స్టే విధించింది?**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పథకాలను శాసనసభ ఆమోదించిన ప్రత్యేక చట్టం ఆధారంగా కాకుండా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అమలు చేస్తున్నారనే అంశాన్ని పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. గత విచారణలో ప్రభుత్వం తన వాదనను వివరిస్తూ పూర్తి వివరాలతో ప్రతివాద పత్రం సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ప్రభుత్వం నిర్ణీత సమయంలో ప్రతివాద పత్రం దాఖలు చేయకపోవడంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ నేపథ్యంలో జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ఈ పథకాల అమలుకు సంబంధించిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధించారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేశారు.

**పేద కుటుంబాలకు కీలకమైన పథకాలు**

కల్యాణలక్ష్మి పథకం తెలంగాణలో 2014లో ప్రారంభమైంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని యువతుల వివాహానికి ఆర్థిక సహాయం అందించడం దీని ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాల్లో వివాహ ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు షాదీ ముబారక్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. వివాహ సమయంలో ఒకేసారి ఆర్థిక సహాయం అందించడం ద్వారా పేద కుటుంబాలకు కొంత మేర ఆర్థిక ఉపశమనం కల్పించడం ఈ పథకాల లక్ష్యంగా ఉంది.

ఈ పథకాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రంలోని వేలాది కుటుంబాలు ప్రయోజనం పొందాయి. వివాహం అనేది ప్రతి కుటుంబానికి ముఖ్యమైన సందర్భం. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు వివాహ ఖర్చులు పెద్ద ఆర్థిక భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆర్థిక సహాయం వారికి కొంత ఊరటగా నిలిచింది.

**ఆర్థిక సహాయం పెరుగుతూ వచ్చింది**

ఈ పథకాల కింద అందించే ఆర్థిక సహాయం కాలక్రమేణా పెరిగింది. తొలుత రూ.51 వేలుగా ఉన్న సహాయాన్ని తరువాత రూ.75,116కు పెంచారు. అనంతరం రూ.1,00,116కు పెంచి కొనసాగించారు. దివ్యాంగ యువతులకు ప్రత్యేకంగా రూ.1,25,016 వరకు సహాయం అందించే విధానం కూడా అమలులో ఉంది.

ప్రభుత్వం మారినా ఈ పథకాలు కొనసాగడం వాటికి ఉన్న సామాజిక ప్రాధాన్యాన్ని సూచిస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగిస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఈ పథకాల కోసం బడ్జెట్ కేటాయింపులు, శాసనసభ ఆమోదం ఉన్నాయని మంత్రులు స్పష్టం చేశారు.

**లబ్ధిదారుల్లో ఆందోళన**

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఇప్పటికే వివాహాలు నిర్ణయించుకున్న పేద కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. వివాహ ఖర్చుల కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని ఆశించిన కుటుంబాలు ఇప్పుడు తదుపరి న్యాయస్థానం నిర్ణయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వివాహ తేదీలు దగ్గరపడుతున్న కుటుంబాలకు ఈ పరిణామం మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు తమకు ఆర్థిక సహాయం ఎప్పుడు అందుతుందనే విషయంపై స్పష్టత కోసంప్రభుత్వప్రకటననుఎదురుచూస్తున్నారు.

అయితే ఇది శాశ్వతంగా పథకాలను రద్దు చేసిన ఉత్తర్వు కాదు. ప్రస్తుతం కోర్టు ఇచ్చింది మధ్యంతర స్టే మాత్రమే. తదుపరి విచారణలో ప్రభుత్వం తన వాదనలను, పథకాల చట్టవరవైనఆధారాలనుకోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తరువాత న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలపై పథకాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

**ప్రభుత్వ న్యాయపోరాటం**

హైకోర్టు స్టే నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పథకాలను కాపాడేందుకు న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రులు ప్రకటించారు. స్టేను ఎత్తివేయించేందుకు ఉన్నత న్యాయస్థానంలోని విభజన ధర్మాసనం ముందు అప్పీల్ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఈ పథకాలను కొనసాగించడానికి అవసరమైన న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు కూడా తెలిపింది. గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు తగిన చట్టపరమైన రక్షణ ఉందా లేదా అనే అంశంపై కూడా అధికార వర్గాలు పరిశీలన చేస్తున్నట్లు సమాచారం.

**న్యాయస్థానం ప్రశ్నలు -- ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలు**

ఈ కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కూడా ప్రశ్నలు లేవనెత్తింది. ముఖ్యంగా ప్రభుత్వ భూముల సేకరణలో భూములు కోల్పోయిన కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, మరోవైపు సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు వంటి అంశాలపై న్యాయస్థానం ప్రశ్నలు అడిగింది. అయితే ప్రభుత్వం తన ఆర్థిక వ్యవహారాలను ఎలా నిర్వహించాలో కోర్టు నిర్ణయించడం లేదని, ప్రాధాన్యతలను వివరించాల్సిన అవసరం ఉందనే దిశలో ప్రశ్నలు లేవనెత్తినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

దీంతో ఈ కేసు కేవలం రెండు సంక్షేమ పథకాల చెల్లింపులకే పరిమితం కాకుండా, ప్రభుత్వ సంక్షేమ విధానాలు, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన ఆధారాలపై విస్తృత చర్చకు దారితీస్తోంది.

**రాజకీయంగా కూడా ప్రాధాన్యం**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. గత ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాలను తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించింది. అందువల్ల రెండు ప్రధాన రాజకీయ పక్షాలు ఈ అంశాన్ని తమ తమ రాజకీయ వాదనలకు అనుగుణంగా ప్రస్తావించే అవకాశం ఉంది.

ప్రభుత్వం మాత్రం పేద కుటుంబాలకు ఉపయోగపడుతున్న సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత తమపై ఉందని చెబుతోంది. ప్రతిపక్షాలు కూడా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం న్యాయపరమైన చర్యలను వేగవంతం చేయాలని కోరుతున్నాయి.

సెప్టెంబర్ 9పై అందరి దృష్టి

ప్రస్తుతం అందరి దృష్టి సెప్టెంబర్ 9వ తేదీన జరగనున్న తదుపరి విచారణపై ఉంది. ప్రభుత్వం తన పూర్తి వాదనను కోర్టు ముందు ఉంచిన తరువాత న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది కీలకం. మధ్యంతర స్టే కొనసాగుతుందా? ఎత్తివేస్తారా? లేక పథకాల అమలుకు సంబంధించి కొత్త మార్గదర్శకాలు జారీ చేస్తారా? అన్నది అప్పటి విచారణలో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు విధించిన మధ్యంతర స్టే తెలంగాణలో పేద కుటుంబాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. పథకాల రాజ్యాంగబద్ధత, ప్రభుత్వ ఉత్తర్వులకు చట్టపరమైన ఆధారం, సంక్షేమ పథకాల అమలులో న్యాయపరమైన విధానాలు వంటి కీలక అంశాలు ఈ కేసులో ముందుకు వచ్చాయి.

ప్రస్తుతం ఈ పథకాలు శాశ్వతంగా రద్దు కాలేదు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు చెల్లింపులు నిలిపివేయాలన్నదే ప్రస్తుత మధ్యంతర ఆదేశం. ప్రభుత్వం న్యాయపరంగా పోరాడుతామని ప్రకటించిన నేపథ్యంలో సెప్టెంబర్ 9న జరిగే విచారణ పేద కుటుంబాలు, లబ్ధిదారులు, రాజకీయ వర్గాలు, ప్రభుత్వానికి అత్యంత కీలకంగా మారింది.

# హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ‘సి’ డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్ మ్యాచ్‌లో హీరాధి క్రికెట్ క్లబ్ మరియు ఎం.ఎల్. జైసింహ క్రికెట్ క్లబ్ తలపడ్డాయి.



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ ఆగస్టు 21:

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ‘సి’ డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్ మ్యాచ్‌లో హీరాధి క్రికెట్ క్లబ్ మరియు ఎం.ఎల్. జైసింహ క్రికెట్ క్లబ్ తలపడ్డాయి.బి. విజయ్ గౌతమ్ రెడ్డి అద్భుత ఇన్నింగ్స్‌తో 62 పరుగులు చేయడంతో పాటు 1 వికెట్ తీసుకుని, హీరాధి క్రికెట్ క్లబ్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది.మొదట బ్యాటింగ్ చేసిన హీరాధి క్రికెట్ క్లబ్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. ఇందులో బి. విజయ్ గౌతమ్ రెడ్డి 71 బంతుల్లో 62 పరుగులు (5 ఫోర్లు), ఎం. నాగ మాన్విక్ 81 బంతుల్లో 46 పరుగులు (7 ఫోర్లు), ఎస్. ఆదిత్య దాస్ 55 బంతుల్లో 38 పరుగులు (5 ఫోర్లు) చేశారు.227 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఎం.ఎల్. జైసింహ క్రికెట్ క్లబ్ 49.3 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో హీరాధి క్రికెట్ క్లబ్ 17 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.హీరాధి క్రికెట్ క్లబ్ కార్యదర్శి శ్రీ మహేందర్ గౌడ్ జట్టు సభ్యులందరినీ అభినందిస్తూ, జట్టు సమష్టి కృషిని ప్రశంసించారు.

# కుండలేశ్వరం ఏటుగట్టు పై కమాన్ కట్ మరమ్మత్తులు

ట్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

ముమ్మిడివరం మండలం అన్నం పల్లి లక్ష్మీదేవిలంక వద్ద బొబ్బర్లంక - పల్లంకుర్రు పిడబ్ల్యూ ఏటిగట్టు పై ఏర్పాటుచేసిన ఐరన్ కమాన్ కట్ కు అధికారులు మరమ్మత పనులు చేపట్టారు. ఈనెల 17న కమాన్ కట్‌లో బొలెరో వాహనం ఇరుక్కుపోవడంతో ధ్వంసమైన ఐరన్ కమాన్ కట్ ను పూర్తిగా తొలగించి కొత్త రాడ్లు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న కుండలేశ్వరం ఆలయానికి నిత్యం వాహనాలపై వచ్చే భక్తులు ఏటి గట్టు



పలుచోట్ల ప్రమాదకరంగా ఉండడంతో అధికారులు భారీ వాహనాలు నిషేధించడం జరిగింది. అయినప్పటికీ కొంతమంది రాత్రి వేళల్లో లోడు వాహనాలు



తీసుకువెళుతూ కమాన్ కట్ ధ్వంసం చేస్తున్నారు. ఏటి గట్టు మరమ్మత్తులు చేసి అన్ని వాహనాలకు అనుమతించాలని సర్వత్మ సర్వత్రా విజ్ఞప్తి చేస్తున్నారు.

# గ్లోబల్ కన్వెన్షన్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న కట్టా సురేష్

రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21 :

దశాబ్దాలుగా బిగ్ డేటా క్లినికల్ అనలిటిక్స్ రంగాలలో అందించిన విశేష సేవలు, సాంకేతిక ఆవిష్కరణలకు గుర్తింపుగా కట్టా సురేష్ కి ప్రతిష్టాత్మకమైన

ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ (ఎన్ఆర్ఐవీఏ) 8వ గ్లోబల్ కన్వెన్షన్ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ మాజీ చైర్మన్ సుంకు జయసింహ, ఏపీ మంత్రి టీజీ భరత్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన సురేష్ ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లి అక్కడ మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి బిగ్ డేటా అనే భావన ప్రాచుర్యంలో లేని 1997లోనే దూరదృష్టితో సామా టెక్నాలజీస్ ను స్థాపించారని పేర్కొన్నారు . భవిష్యత్తులో భారీ స్థాయి డేటా ప్రాధాన్యతను ముందుగానే గుర్తించిన ఆయన. డేటాను విశ్లేషించి ఉపయోగకరమైన సమాచారంగా మార్చే దిశగా సంస్థను అభివృద్ధి చేశారు. కట్టా సురేష్ నాయకత్వంలో సామా టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన బిగ్ డేటా ఆధారిత క్లినికల్ అనలిటిక్స్ సాంకేతికతలు కోవిడ్-19 మహమ్మారి సమయంలో వ్యాక్సిన్ అభివృద్ధి. క్లినికల్ ట్రయల్



డేటా విశ్లేషణ సంబంధించిన భారీ డేటాను విశ్లేషించడంలో, నిర్ణయ ప్రక్రియలను వేగవంతం చేయడంలో కీలకంగా ఉపయోగపడ్డాయి. అతి తక్కువ సమయంలోనే వ్యాక్సిన్లు అందుబాటులోకి రావడంలో ఈ పరిశోధనలు ఒక కీలక మైలురాయిగా నిలిచాయి. ఈ విధంగా సామా టెక్నాలజీస్ “ఏఐ”ఆధారిత క్లినికల్ అనలిటిక్స్’ లో ప్రముఖ సంస్థగా ప్రపంచ వైద్యరంగ చరిత్రలో తన స్థానాన్ని ఏర్పరచుకున్నారని తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో జనసేనకు చుక్కెదురా..?

## అభివృద్ధి పనుల్లో వైసీపీకి పెద్దపీట..!

**అభివృద్ధి పనుల్లో వైసీపీకి పెద్దపీట..!**

ట్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

శంఖవరం: రాష్ట్రంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామస్థాయినుంచి అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని కూటమినేతలు పదే పదే చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ముఖ్యంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, స్థానిక కార్యక్రమాల్లో జనసేన నాయకులకు సరైన ప్రాధాన్యం



దక్కడం లేదని ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.శంఖవరం మండలం కొత్తూరు గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు గురువారం మండల నిధులతో పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. అయితే ఈ కార్యక్రమానికి కూటమిలో భాగస్వామ్యమైన జనసేన పార్టీ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీగా ఉన్న జనసేనకు అభివృద్ధి కార్యక్రమాల్లో కనీస గౌరవం, సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఉందనిఆపార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

# నూతన ప్రభుత్వ కార్యాలయ భవనాలతో ప్రజలకు మెరుగైన సేవలురిజిస్ట్రేషన్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకువస్తాం..

--రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..
---అభివృద్ధి సంక్షేమ మాప్రభుత్వం లక్ష్యం.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

జగిత్యాల జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగై సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి జగిత్యాల మున్సిపాలిటి పరిధిలోని ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సి.సి.ఎల్. ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎం .డి. హౌసింగ్ గౌతం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పర్యటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఒకే రోజు జగిత్యాల జిల్లాలో రూ. 11.80కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చూడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన



నిర్మాణానికి రూ.2.25 కోట్లు, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, భీమారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్లు, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, మాల్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్లు, మెట్‌పల్లిసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి వివరించారు.ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అధికారులు మరియు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనువైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. కార్యాలయాల నిర్మాణంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు ప్రధాన లక్ష్యాలుగా తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీరేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యులు ఎల్ .రమణ, చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం , వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, అదనపు కలెక్టర్ లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహ రావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్, రాయికల్ మున్సిపల్ చైర్మన్, ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై ప్రశ్నించిన జనసేన నాయకుల అక్రమ అరెస్టులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనసేన నాయకుల నిరసన

ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

జగిత్యాల జిల్లా కేంద్రం లో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో జరుగుతున్న అవకతవకలు, ప్రజా సమస్యలపై ప్రశ్నించిన జనసేన నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని జనసేన నాయకులు తీవ్రంగా ఖండించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జగిత్యాల పర్యటన సందర్భంగా లిజగిత్యాల జిల్లా నాయకులు బెక్కం జనార్దన్ ఆధ్వర్యంలో జగిత్యాల జనసేన పార్టీ నాయకులు కార్యాకర్తలు నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా శివారెడ్డి పాల్గొన్నారు.

**అధికార ప్రతినిధి చల్లా శివారెడ్డి మాట్లాడుతూ**ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమేనన్నారు. జగిత్యాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో జరుగుతున్న అవకతవకలపై ప్రశ్నించినందుకే తమను, తమ నాయకులను అరెస్టు చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంఅమలులో పూర్తి పారదర్శకత పాటించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న సమయంలో ప్రజల సమస్యలను వినాల్సింది పోయి ప్రశ్నించే నాయకులను అరెస్టు



చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని విమర్శించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రాంతానికి సమీపంలో డంపింగ్ యార్డ్ ఉండటంతో అక్కడ నివసించే పేద కుటుంబాల ఆరోగ్యం, పారిశుధ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. “పేదలకు ఇళ్లు నిర్మించి, పక్కనే చెత్త కుప్పలు ఉంటే వారికి సురక్షితమైన జీవనం ఎలా సాధ్యం?” అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా బెక్కం జనార్దన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రశ్నించడం తమ బాధ్యత అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులను వివరణ అడగడానికి వచ్చిన తమపై అక్రమ అరెస్టులు చేసి ప్రజాస్వామ్యాన్ని అణచివేయడం సరికాదన్నారు.జగిత్యాల పట్టణంలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని, డంపింగ్ యార్డ్ సమస్య, రోడ్ల సమస్యలు, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని జనార్దన్





డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులు బొల్లి రాము, బొల్లి లక్ష్మణ్ గట్ల శ్రీకర్, గాజుల సంకీర్తన్, ఠాకూర్ కిరణ్‌సింగ్, బొల్లి లక్ష్మణ్, బెక్కం ప్రవీణ్, ఎడమల జైపాల్‌రెడ్డి, బత్తిని బాబుగౌడ్ కనికుట్ల నరేష్, తీట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భద్రతపై,సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా అప్రమత్తత పై అవగాహనా సదస్సు

ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో బాలికల భద్రత, సైబర్ నేరాల నివారణ, మానవ అక్రమ రవాణా, భరోసా కేంద్రం సేవలు మరియు మహిళా భద్రతపై షీ టీం ఆధ్వర్యంలో శుక్రవారం రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని షీ టీం ఎస్ఐ కుమారి సునంద మరియు సైబర్ క్రైమ్ ఎస్ఐ కరుణాకర్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం, సైబర్ క్రైమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్,భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీం సేవలు -- బాలికలకు భద్రతపై అవగాహన.షీ టీం ఎస్ఐ సునంద షీ టీం విధులు, బాధ్యతలు, షీ టీంను ఏ విధంగా సంప్రదించాలి, షీ టీం సిబ్బంది నిర్వహించే విధులు, మహిళలు మరియు బాలికల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించి, గోప్యతతో ఎలా పరిష్కరిస్తారనే అంశాలను వివరించారు. అలాగే ఫోక్సో ఆక్ట్ ప్రాముఖ్యత, బాలికల రక్షణకు చట్టపరమైన భద్రత, టి సేఫ్ యాప్ వినియోగం గురించి అవగాహన కల్పించారు.

విద్యార్థినులు తమ లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో, శ్రద్ధగా చదువుకోవాలని, తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సునంద గారు సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం.సైబర్ క్రైమ్ ఎస్ఐ కరుణాకర్ వివిధ రకాల సైబర్ నేరాల గురించి విద్యార్థినులకు వివరించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు,



సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, సందేశాలు, ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ లు వంటి సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని, సైబర్ నేరానికి గురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

**భరోసా కేంద్రం సేవలపై అవగాహన.**

భరోసా కేంద్రం సిబ్బంది భరోసా కేంద్రం అందించే సేవలు, విధులు మరియు బాధ్యతల గురించి విద్యార్థినులకు వివరించారు. మహిళలు, బాలికలు ఏవైనా వేధింపులు, హింస లేదా ఇతర సమస్యలకు గురైనప్పుడు భరోసా కేంద్రం ద్వారా పొందగల సహాయం, కౌన్సెలింగ్ మరియు ఇతర సేవల గురించి అవగాహన కల్పించారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది మానవ అక్రమ రవాణా అంటే ఏమిటి, అది ఏ విధంగా జరుగుతుంది, అక్రమ రవాణాకు గురయ్యే పరిస్థితులు ఏమిటి, దాని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.



అనుమానాస్పద వ్యక్తులు లేదా పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు..

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి, సైబర్ నేరాలు మరియు ఇతర ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, తమ భద్రతతో పాటు సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు.

ముఖ్యమైన హెల్ప్ లైన్ నెంబర్లు:
అత్యవసర సహాయం: 112 ,
మహబూబాబాద్ షీ టీం నెంబర్: 8712656935
,సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్: 1930 ,
చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్: 1098
మహిళ హెల్ప్ లైన్ నెంబర్: 181

600 మంది విద్యార్థినులకు అవగాహన

ఈ కార్యక్రమంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, అధ్యాపక సిబ్బంది మరియు సుమారు 600 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది రమేష్, పార్వతి, సుధారాణి, ప్రియాంక, ఏ హెచ్ టి యూ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ నాయక్, అరుణ, భరోసా సిబ్బంది మౌనిక, బేబీ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి: ఓటర్ల జాబితా సవరణలో తప్పులపై ప్రజల ఆందోళన

ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

అమరావతి, ఆగస్ట్ 21, 2026: రాష్ట్రంలో ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమం క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. అధికారికంగా నోటిఫికేషన్లు జారీ అవుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అందుతున్న జాబితాలు మరియు ధృవపత్రాల్లో అక్షర దోషాలు తలెత్తుతుండటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పేరిట తలెత్తుతున్న సమస్యలపైస్థానికంగాసర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓటరు నమోదు మరియు జాబితాల రూపకల్పన ప్రక్రియకు సంబంధించి మరింత పారదర్శకత పాటించాలని, తప్పులను



వెంటనే సరిదిద్దాలని ప్రజా సంఘాలు, రాజకీయ వర్గాలు కోరుతున్నాయి.

# పలనాడు: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

పలనాడు, ఆగస్ట్ 21, 2026: పలనాడు జిల్లా మచర్లలోని బ్రహ్మానాయుడు చెరువు మార్గంలో ఉన్న విలువైన ప్రభుత్వ కాల్వ పోరంబోకు భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ మరియు మున్సిపల్ యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. సర్వే నంబర్లు 1155/2, 1156/2, 1157/2, 1158/2 పరిధిలోని ప్రభుత్వ భూముల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ తనిఖీల్లో తహశీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మండల సర్వేయర్ చల శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు తదితరులు సంయుక్తంగా పాల్గొని హద్దులను నిర్ధారించారు. ఈ భూములు ఆక్రమణల బారిన పడకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తే లేదా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు ఈ సందర్భంగా గట్టిగా హెచ్చరించారు.

# అమరావతి:ఘనంగాశ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ శంకుస్థాపన

ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

అమరావతి, ఆగస్ట్ 21, 2026: తుళ్లూరు మండలం తుళ్లూరు గ్రామంలో శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి నూతన దేవాలయ శంకుస్థాపన మహోత్సవం శుక్రవారం ఉదయం అత్యంత వైభవంగా మరియు శాస్త్రోక్తంగా జరిగింది.నిర్ణయించిన శుభ ముహూర్తం ప్రకారం ఉదయం మంగళవాయిద్యాలమధ్య వేద పండితుల మంత్రోచ్చారణలతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వాస్తు పురుష తదితర విశేష హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం వేదోక్తంగా శంకుస్థాపన ఘట్టాన్ని నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో దేవాలయ ఈవో నామినే గోపి, పలువురు ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో గ్రామంలో




ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని, భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ పవిత్ర వేడుకలో భాగస్వాములయ్యారని నిర్వాహకులు తెలిపారు.

# చిలకలూరిపేట పండరీపురానికి చెందిన యామిని (24) హైదరాబాద్‌లోని కెపిహెచ్ రోడ్ నంబర్ 1లో ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్‌లో మృతిచెందిన ఘటన విషాదం నింపింది.



ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న యామిని కొంతకాలంగా ఉద్యోగం లభించక మనస్తాపానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. హాస్టల్‌లో ఆమె మృతిచెందిన విషయాన్ని గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# జగిత్యాల్ కు వచ్చిన రాష్ట్ర మశీత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి కి స్వాగతం పలికి పూలమలను వేసిన మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల్,చొప్పదండి, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం



ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

అభివృద్ధి కార్యక్రమాలకు జగిత్యాల కు విచ్చేసిన రాష్ట్ర గృహనిర్మాణ రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని వ్యవసాయ మార్కెట్ చల్గల్ వద్ద కలిసి ఘన



స్వాగతం పలికిన సంక్షేమ శాఖ మంత్రివర్యుల అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , జగిత్యాల చొప్పదండి ఎమ్మెల్యే లు డా.సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య కాంగ్రెస్ జిల్లా నాయకులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ లోకేష్ కుమార్ కు పూల మొక్క ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



ట్రై నెట్ న్యూస్। 20 ఆగస్టు 2026

జగిత్యాల ఆర్ అండ్ బి గెస్ట్ లో స్టేట్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ (హైదరాబాద్) పూల



మొక్క ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్.లు వున్నారు

ట్రై నెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం ,ఆగస్టు ,22, 2026
www.trinetnews.com

# ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తేవడంలో టీడీపీ , వైయస్సార్ సిపి పూర్తిగా విఫలం బి డా. షేక్ మహబూబ్ వలి,



ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తేవడంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండు ప్రాంతీయ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డా. షేక్ మహబూబ్ వలి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెదేపా, వైకాపా, జనసేన మూడు పార్టీలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బిజెపికి తొత్తులుగా మారాయని అన్నారు. "రాష్ట్రంలో ప్రతిపక్షం ఎక్కడ ఉంది? మూడు పార్టీలు బిజెపికి దోస్తులుగా మారితే రాష్ట్ర సమస్యలపై కేంద్రాన్ని ఎవరు నిలదీస్తారు?" అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారం రాష్ట్రానికి 5 నుండి 10 సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటు సాక్షిగా అప్పటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా వస్తే పన్ను రాయితీలు, అధిక కేంద్ర నిధులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు వచ్చేవని, కానీ గత 12 సంవత్సరాలలో రెండు పార్టీలు ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. టీడీపీ వైఫల్యం 2014-2018 వరకు కేంద్రంలో ఎన్ డి ఏ భాగస్వామిగా ఉండి కూడా బలమైన ఒత్తిడి తేలేదు. ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలో మాత్రమే ఎన్డీఏ నుండి బయటకు వచ్చి డ్రామాలు చేసిందన్నారు. 2024 నుండి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు గడిచినా ప్రత్యేక హోదాపై స్పష్టత లేదని అన్నారు.

వైయస్సార్సీపి వైఫల్యం 2019లో అధికారంలోకి వచ్చిన వైస్సార్సీపీ "ప్రత్యేక ప్యాకేజీయే ప్రత్యేక హోదా" అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించిందని, కేంద్రంతో రాజీపడి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని ఆరోపించారు. 2018లో 14వ ఆర్థిక సంఘం సిఫార్సులతో కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వలేమని చెప్పిందని, వెనుకబడిన జిల్లాలకు ఇస్తామన్న నిధులు కూడా సక్రమంగా రాలేదని తెలిపారు. దీని ఫలితంగా యువతకు ఉద్యోగాలు, పరిశ్రమలు, రాష్ట్ర అభివృద్ధి అన్నీ ఆగిపోయాయని అన్నారు. అధికారం కోసం రాజీపడి రెండు పార్టీలు ఏపీ భవిష్యత్తును నాశనం చేశాయని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిజంగా పోరాడే నాయకత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, అందుకే ఏపీ లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# ఉద్యాన పంటలకు నీటి కుంటలు (పంట కుంటలు) చాలా ముఖ్యం: జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న





ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

సూపర్ ఎల్ నినో పరిస్థితుల్లో, వర్షాభావ పరిస్థితుల్లోఉద్యాన,ఆయిల్‌పామ్,కూరగాయలు,మల్బరీ పూలు,మునగ,ఉల్లి,మొదలైన మార్కెట్ డిమాండ్ పంటలు సాగు చేస్తున్న రైతులకు నీటి సంరక్షణ పద్ధతులు చాలా ముఖ్యమని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు.

వాటిలో ముఖ్యమైనవి: నీటి కుంటలు,కూరగాయ పందిళ్లు,ట్రెల్లిస్‌పద్ధతి,మల్చింగ్‌ఎత్తుమడులు,బిందు సేద్యం, ఫర్టిగేషన్, సేంద్రీయ పద్ధతులు, నేచురల్ ఫార్మింగ్, మొదలైనవి పాటించాలి. నీటి కుంటల ఉద్దేశము - వర్షపు నీటి సంరక్షణ లేదా వర్షపు నీటి సేకరణ. ఎండాకాలం లేదా కరవు సమయాల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు వర్షపు నీటిని వృథా చేయకుండా సేకరించి, ట్యాంకుల్లో లేదా భూమిలో నిల్వ చేయడం. కూరగాయలు,ఆయిల్‌పామ్ ,పండ్ల తోటలు,మల్బరీ పూలు, మునగ,మొదలైనవి సాగు చేసినప్పుడు పూత,పిందెదశలలో(క్రిటికల్ స్టేజెస్) నీటిపారుదల ఇచ్చి, పంటను కాపాడుకోవడం. పథకాలు: 5 ఎకరాల లోపు విస్తీర్ణం కలిగిన రైతులు వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్ గార్ అజివికా మిషన్ గ్రామీణ్ పథకం ద్వారా రెండు సైజుల లో పంట కుంటలు ఏర్పాటు చేసుకోవచ్చు.

మోడల్ 01:కొలతలు: 40 అడుగుల పొడవు X 40 అడుగుల వెడల్పుX 6.5 అడుగుల లోతు (12 మీటర్ల పొడవు X 12 మీటర్ల వెడల్పుX 2 మీటర్ల లోతు)అంచనా వ్యయం: రూ. 80 వేలు పని దినాల సంఖ్య: 400

మోడల్ 02:కొలతలు: 65 అడుగుల పొడవు X 65 అడుగుల వెడల్పు X 10 అడుగుల లోతు (20 మీటర్ల పొడవు X 20 మీటర్ల వెడల్పుX3 మీటర్ల లోతు) అంచనా వ్యయం 4 లక్షల రూపాయలు, పని దినాల సంఖ్య : 1100

అర్హత:5 ఎకరాల లోపు సన్న, చిన్నకారు రైతులు.

కావలిసిన పత్రాలు: పట్టదార్ పాస్ బుక్ జాబ్ కార్డ్

ఆయిల్ పామ్ పథకం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్ పామ్ పథకంలో ఆయిల్ పామ్ రైతులకు - కొలతలు: 65 అడుగుల పొడవు X 65 అడుగుల వెడల్పు X 10 అడుగుల లోతు (20 మీటర్ల పొడవు X 20 మీటర్ల వెడల్పు X 3 మీటర్ల లోతు) జియో మెంబ్రేన్ షీట్

అంచనా వ్యయం: రూ. 4 లక్షలు రాయితీ:. 90 వేల రూపాయలుకనుక రైతులు శాశ్వత ఆదాయం కోసం నీటి కుంటలు (పంట కుంటలు) ఏర్పాటు చేసుకోవాలని అధికారి విజ్ఞప్తి చేశారు.

# వీరభద్ర స్వామి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి దంపతులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వాసంతి



ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

బలిజపల్లి గ్రామంలోని వీరభద్ర స్వామి దేవాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠతోలి పాటు శ్రీ పోచమ్మ అమ్మవారి నాభి శిలల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వాసంతి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పోచమ్మ అమ్మవారి నాభి శిలల పునఃప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం బసవ కళ్యాణ ఆశ్రమ పీఠాధిపతి, మహా తపస్వి పూజ్య శ్రీ షడా బసవలింగ అవధూత స్వామి వారి ఆశీస్సులను మాజీ మంత్రి దంపతులు స్వీకరించారు. స్వామివారితో ఆధ్యాత్మిక విషయాలపై మాట్లాడి, వారి ఆశీర్వాదం పొందారు. ఈ పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా గ్రామ ప్రజలందరికీ వీరభద్ర స్వామి, పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పాడిపంటలతో సమృద్ధి నెలకొనాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలను గ్రామ ప్రజలు ఐకమత్యంతో కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసం, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ఆలయాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెంట్ సావ్యో స్కూల్ బస్సు కు తప్పిన పెను ప్రమాదం





ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

సెంట్ సావ్యో స్కూల్ బస్సు లో స్కూలు విద్యార్థులను ఎక్కించుకొని అన్నారం రోడ్డు కు వస్తున్న క్రమంలో బస్సు వెనుక టైరు అకస్మాత్తుగా ఊడి పోవడంతో బస్సులో ఉన్న చిన్నారులు ఒక్కసారిగా భయాందోళనకు గురైనారు.

ప్రమాద సమయంలో బస్సులో 30 మంది గా విద్యార్థులు ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్ యజమాన నిర్లక్ష్యమే కారణం అని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అధికారులు, చూసుకోవాలి. ఆర్ టి ఏ అధికారులు ప్రతి సంవత్సరం పట్టణంలో ఉన్న స్కూల్ బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చి పిల్లల ప్రాణాలు కాపాడాలి. కొన్ని స్కూల్ బస్సుల డ్రైవర్స్ డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడుతున్నారు. ఇలాంటి వారికి డ్రైవింగ్ లైసెన్స్ రద్దుచేయాలి. ఎందుకంటే పదుల సంఖ్యలో పిల్లల ప్రాణాలు వారి చేతిలోనే ఉంటాయి. స్కూల్ యాజమాన్యాలు పిల్లల పై, బస్సుల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని విద్యార్థుల తల్లి తండ్రులు తమ ఆవేదన వ్యక్త పరిచారు.

# ఎస్ ఐ ల బాధ్యతల స్వికరణ



ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తంగాళ్లపల్లి ఎస్.ఐ అశోక్ , ఇల్లంతకుంటా ఎస్.ఐ ఉపేంద్ర చారి , వేములవాడ రూరల్ ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి , కొనరవుపేట ఎస్.ఐ రామ్మోహన్ ఈరోజు ఆయా పోలీస్ స్టేషన్ల లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందించడం జరిగిందిఈసందర్భంగా జిల్లా ఎస్పీ నూతనంగా బాధ్యతలు స్వీకరించినఎస్ఐలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాంతిభద్రతల పరిరక్షణతోపాటుప్రజలకుమెరుగైనపోలీస్‌సేవలుఅందించేలాసమర్థవంతంగావిధులు నిర్వహించాలని, విజిబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించి ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

# మెట్‌పల్లి మైనారిటీ, మెట్లచిట్టాపూర్ ఎంజేపీ పాఠశాలలను సందర్శించిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.





ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మెట్‌పల్లి మైనారిటీ పాఠశాలతో పాటు మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబా ఫూలే (ఎంజేపీ ) పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులతో ఎమ్మెల్యే సంజయ్ ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, లక్ష్యాలు, భవిష్యత్ ఆశయాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలు, పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలపై కూడా ఆరా తీశారు. విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే జీవితంలో మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర సృజనాత్మక రంగాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలి" అని ఎమ్మెల్యే సంజయ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలల అవసరాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా వసతులపై సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు

# ఎడ్లపాడులో ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమం.. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు తప్పనిసరిగా హాజరుకావాలి..



ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

ఎడ్లపాడు: జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, పల్నాడు జిల్లా వారి ఆదేశాల మేరకు ఎడ్లపాడు మండలంలో ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. ఈనెల ఆగస్టు 22, 23 తేదీలలో ఈకార్యక్రమం కొనసాగనుంది. ఈ ప్రత్యేకకార్యక్రమానికి మండలంలోని అందరు బీఎల్‌ఓలు మరియు బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన పూర్తి రికార్డులతో విధిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు. అలాగే,ఆయా రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా సంబంధిత బీఎల్‌ఓలు తగిన సమాచారం అందించి సమన్వయం చేయాలనిసూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎటువంటి అంతరాయాలు లేకుండా సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు,బీఎల్‌ఓలు మరియు బీఎల్‌ఏలు అందరూ పరస్పర సహకారంతో పనిచేయాలని తహసీల్దార్ విజయశ్రీ విజ్ఞప్తి చేశారు.

# జన్నారం మండలం లింగయ్య పల్లెలో 11 వేల లంచం తీసుకుంటు న్న కార్యదర్శి వరలక్ష్మి, ఏసీబీ అధికారుల దాడి కేసు నమోదు



ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని లింగయ్యపల్లెలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లంచం తీసుకుంటున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డట్లు సమాచారం. ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం పంచాయతీ కార్యదర్శి రూ. 11 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు వరలక్ష్మిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

# జగదాంబ సేవాలాల్ మందిరం పనులకు టెండర్ అప్రూవల్

**రంగశివుని తండా-2లో గ్రామస్తులకు టెండర్ అప్రూవల్ కాపీ అందజేసిన మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి**



ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

కుబీర్ మండలంలోని రంగశివుని తండా-2 గ్రామంలో శ్రీ జగదాంబ సేవాలాల్ మందిరం నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ అప్రూవల్ కాపీని ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి శుక్రవారం గ్రామస్తులకు అందజేశారు. త్వరలోనే దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. రంగశివుని తండా-2లో శ్రీ జగదాంబ సేవాలాల్ మందిరంతో పాటు తానూర్ మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయానికి కూడా టెండర్ అప్రూవల్ లభించిందన్నారు. ఆయా దేవాలయాల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. దేవాలయాల నిర్మాణ పనులకు టెండర్ అప్రూవల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెట్టు లక్ష్మి, తండా-2 ఉపసర్పంచ్ విశ్వనాథ్, కదం దిగంబర్ పటేల్, మాజీ సర్పంచ్ రామ్, వర్కరి సాయినాథ్, కదం సురేష్ పటేల్, మొరే రాంచందర్ పటేల్, మధుకర్, మారుతి, రాథోడ్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



ట్రై నెట్ న్యూస్, 21 ఆగస్టు 2026

శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్, సుభద్ర వాటిక నిలయం, ఫూలేనగర్, బైంసాలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాతాజీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పోషకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 175 మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో సి హెచ్ వందన,స వి పీఠం నిర్మల్ జిల్లా కార్యాకారిని , సిరం సుష్మా రెడ్డి -- దేగాం సర్పంచ్, శిరం రాజమణి -- ఈలేగాం సర్పంచ్, రమాబాయి --తాలోడ్ రాధిక కౌన్సిలర్లు పాల్గొని కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు. అలాగే ఎర్రవరం ప్రణీత గారు వక్తగా పాల్గొని, వరలక్ష్మీ వ్రతం విశిష్టత, భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాల ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల ప్రాంగణం మహిళల సందడితో, భక్తి వాతావరణంతో కళకళలాడింది. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కుటుంబ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పాఠశాల ఆ ఎం సి సభ్యులు, మాతాజీలు మరియు సిబ్బంది సహకరించారు.

## శ్రీ రామకృష్ణ పరమహంస మరియు స్వామి వివేకానంద: భక్తి తత్వానికి నిలువెత్తు రూపం

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

అమరావతి, ఆగస్ట్ 21, 2026: ఆధ్యాత్మిక ప్రపంచంలో భక్తికి, గురుశిష్య సంబంధానికి ప్రతీకగా నిలిచిన మహనీయులు శ్రీ రామకృష్ణ పరమహంస మరియు ఆయన పరమ శిష్యుడైన స్వామి వివేకానంద. దైవ సాక్షాత్కారం కోసం తమ జీవితాలను పూర్తిగా అంకితం చేసిన ఈ మహాభక్తుల జీవిత విశేషాలు ఎంతో స్ఫూర్తిదాయకం.

శ్రీ రామకృష్ణ పరమహంస – భక్తి మార్గదర్శకులు

పరమ భక్తుడిగా గుర్తింపు: శ్రీ రామకృష్ణ పరమహంస భగవంతుని దర్శనం కోసం పరితపించిన పరమ భక్తులు మరియు మహోన్నత సాధకులు. ఆయన తన జీవితాంతం భక్తి తత్వంతోనే కాలం గడిపారు.

బోధనలు: సర్వధర్మ సమభావనాన్ని చాటుతూ, ఏ మతమైనా గమ్యస్థానం ఒక్కటేనని తన ఆచరణ ద్వారా నిరూపించిన పరమ భక్తుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు.

స్వామి వివేకానంద జీవిత చరిత్ర & విశేషాలు

పరమ శిష్యుడు: రామకృష్ణ పరమహంస పరమ భక్తుడు మరియు ప్రధాన శిష్యుడైన స్వామి వివేకానంద పూర్వనామం నరేంద్రనాథ్ దత్తా. గురువు గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ఆయన తన సర్వస్వాన్ని త్యాగం చేశారు.

జననం: జనవరి 12, 1863న కోల్‌కతాలో జన్మించారు. ఈయన జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటారు.







తల్లిదండ్రులు: తండ్రి విశ్వనాథ్ దత్తా కలకత్తా హైకోర్టు న్యాయవాది కాగా, తల్లి భువనేశ్వరి దేవి ధార్మిక భావాలు గల మహిళ.

షికాగో ప్రసంగం: 1893 సెప్టెంబరు 11న అమెరికాలోని షికాగోలో జరిగిన ప్రపంచ మత మహాసభల్లో పాల్గొని భారతీయ సనాతన ధర్మ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు.

సంస్థల స్థాపన: సమాజ సేవయే మాధవ సేవ అనే తత్వంతో 1897లో రామకృష్ణ మఠం మరియు రామకృష్ణ మిషన్‌ను స్థాపించారు.

జీవిత కాలం & నిర్యాణం: స్వామి వివేకానంద కేవలం 39 సంవత్సరాల అల్ప వయస్సులోనే అనగా జూలై 4, 1902న బేలూరు మఠంలో మహాసమాధి చెందారు.

## పలనాడు జిల్లా, నకిరికల్లు
## నకిరికల్లులో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహణ..!



ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

తనిఖీల వివరాలు: నకిరికల్లు మండల పరిధిలో పోలీసు యంత్రాంగం నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు రోడ్డు భద్రతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ తనిఖీల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పట్టుబడిన ఐదుగురు ద్విచక్ర వాహనదారులను స్థానిక ఎస్సై కే. సతీశ్ నరసరావుపేట కోర్టులో హాజరుపరిచారు.

న్యాయస్థానం ఆదేశాలు: కేసును విచారించిన మెజిస్ట్రేట్ నిబంధనలను ఉల్లంఘించిన ప్రతి ఒక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ ఐదుగురు వాహనదారులకు కలిపి మొత్తం రూ. 50 వేల జరిమానా పడినట్లు ఎస్సై తెలిపారు.

భద్రతా హెచ్చరికలు: మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల క్షణికావేశంలో ప్రాణాల మీదకు రావడమే కాకుండా, తోటి ప్రయాణికుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు.

ప్రజా విజ్ఞప్తి: వాహనదారులు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడానికి దూరంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అమరావతి: మోతడక గ్రామంలో మెగా మెడికల్ క్యాంపునకు సర్వం సిద్ధం

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

అమరావతి, ఆగస్ట్ 21, 2026: మోతడక గ్రామంలో ఈ నెల 22వ తేదీన చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కోత్తా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా మెడికల్ క్యాంపునకు సర్వం సిద్ధమైంది. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేసే లక్ష్యంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

?ఈ క్యాంపులో గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ వైద్య సంస్థలు విజయ్స్ కోస్టల్ కేర్, నైరా హాస్పిటల్స్, తారా ఐ కేర్ హాస్పిటల్, ప్రకాష్ డెంటల్ హాస్పిటల్ నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు సేవలు అందిస్తారని స్కూల్ ప్రిన్సిపాల్ పెరికల శ్రీను వెల్లడించారు. స్కూల్ సిబ్బంది, దార్ల సందీప్, దుర్గ తదితరుల సహకారంతో కొనసాగనున్న ఈ శిబిరంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచిత



మందులను పంపిణీ చేయనున్నారు. అమరావతి పరిసర ప్రాంతాలలో తొలిసారిగా ఇంత భారీ స్థాయిలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తుండటంతో స్థానికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## తండ్రి చనిపోయిన విద్యార్థినికి ఆర్థిక సాయం



తండ్రి చనిపోయిన విద్యార్థినికి ఆర్థిక సాయం

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

ఉపాధ్యాయుల మానవత్వం చాటుకున్న వైనం

ఇంకొల్లు:ఇంకొల్లు మండలంలోని ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుద్దుకూరులో 2026 మార్చి 10వ తరగతి పరీక్షలలో 500 మార్కులు సాధించిన విద్యార్థిని ఇటీవల తండ్రిని కోల్పోయారు. ఈ క్రమంలో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ పేద విద్యార్థిని మద్దిరాల అనితను ఆదుకునేందుకు పాఠశాల ఉపాధ్యాయులు ముందుకు వచ్చారు.

?పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఖ. శ్రీనివాస కుమార్ తన సోదరుల సహకారంతో స్వయంగా రూ. 22 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని గురువారం ఆ విద్యార్థినికి అందజేశారు. కష్టకాలంలో చదువు ఆగిపోకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు అందించిన ఈ అండదండలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.

?ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అనిత చదువులో ప్రతిభ కనబరుస్తోందని, ఏ పరిస్థితులలోనూ చదువు మానుకోవద్దని ధైర్యం చెప్పారు. భవిష్యత్తులోనూ ఆమెను బాగా చదివించి ఉన్నత స్థానానికి ఎదిగేలా తమ వంతు అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అకస్మాత్తుగా తండ్రిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న విద్యార్థినికి ఉపాధ్యాయులు చూపిన ఉదారత పట్ల స్థానికులు, తోటి విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు వారిని అభినందించారు.

## శ్రావణ మాస వేడుకలు: ప్రజలకు వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు
## తెలిపిన మాజీ మంత్రి విడదల రజని

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

ఆగస్ట్ 21, 2026: పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు మాజీ మంత్రి విడదల రజని ఘనంగా వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ శుభదినం పురస్కరించుకుని విడుదల చేసిన ప్రత్యేక సందేశం ద్వారా ఆమె తన శుభాకాంక్షలను వెల్లడించారు.ఈ పవిత్రమైన వరలక్ష్మీ వ్రత వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్న మహిళలందరి ఇళ్లలోకి ఆ శ్రీ మహాలక్ష్మి దేవి కటాక్షం సంపూర్ణంగా ప్రసరించాలని ఆమె ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో,అష్టైశ్వర్యాలతోమరియుఆయురారోగ్యాల తో వర్ధిల్లాలని ఆమె మనస్ఫూర్తిగా కోరుకున్నారు.




## డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి చేరిన నగదు

యువకుని నిజాయితీని అభినందించిన సీఐ పి. రమేష్

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

చిలకలూరిపేట:

పట్టణంలోని పురుషోత్తపట్నానికి చెందిన ఏలూరి నరేంద్ర ఉదయం సుమారు 9.00 గంటల సమయంలో మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా, జేబులో ఉన్న రూ. 29,000 నగదు ఆంధ్ర కాలనీ సమీపంలో ప్రమాదశాత్తు జారి కింద పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న బందారపు రాజీవ్ అనే యువకుడు ఆ నగదును గమనించి, ఏమాత్రం దురాశ పడకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు.

?ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బాధితుడు నరేంద్ర తన అవసరాల నిమిత్తం తెచ్చుకున్న నగదు పోవడంతో తీవ్ర



ఆందోళనకు గురయ్యారు. పోయిన సొమ్ము చిన్న మొత్తం కాకపోవడంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అయితే, అదే మార్గంలో వెళ్తున్న యువకుడు రాజీవ్ ఆ రోడ్డుపై పడి ఉన్న కరెన్సీ నోట్లను గమనించి ఏ మాత్రం ఆలోచించకుండా వెంటనే వాటిని భద్రపరిచారు. ఎవరిసొమ్ము వారికి చేర్చాలనే మంచి మనసుతో ఆయన నేరుగా చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.పోలీసుల సమక్షంలో రాజీవ్ ఆ నగదును పూర్తి నిజాయితీతో అప్పగించడంతో అధికారులు సైతం అవాక్కయ్యారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాధితుడు నరేంద్రను స్టేషన్‌కు పిలిపించి ఆరా తీశారు. ఆ వివరాలు సరిపోలడంతో, సదరు యువకుడు రాజీవ్ చేతుల మీదుగానే ఆ రూ. 29,000 నగదును బాధితునికి తిరిగి అందజేశారు.

ఈ సందర్భంగా రాజీవ్ చూపిన నిస్వార్థ నిజాయితీని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే గుణాన్ని సీఐ పి. రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ రోజుల్లోనూ ఇలాంటి నిజాయితీపరులు ఉండటం అభినందనీయమని, యువత ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన కొనియాడారు. పోగొట్టుకున్న సొమ్ము తిరిగి చేరడంతో బాధితుడు నరేంద్ర ఊపిరి పీల్చుకుని, రాజీవ్‌కు మరియు పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రావణమాసం సందర్భంగా డాక్టర్ వరలక్ష్మి గారికి భారత శ్రావణ మహాలక్ష్మి ఉత్తమ జాతీయ సేవా పురస్కారం

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

చిలకలూరిపేట ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ మరియు ఐఎస్ఓ సర్టిఫైడ్ ఆర్గనైజేషన్ శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం మరియు జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈరోజు శ్రావణమాసం సందర్భంగా మహిళలకు ఇచ్చే పురస్కార కార్యక్రమాలలో భాగంగా ట్రస్టు తరుపున పట్టణంలో ప్రముఖ వరలక్ష్మి హాస్పిటల్స్ అధినేత గైనకాలజిస్ట్ డాక్టర్ గరికపాటి వరలక్ష్మి కొమ్మినేని గైనకాలజిస్ట్ గారికి శ్రీ సాయి భారత శ్రావణ మహాలక్ష్మి ఉత్తమ జాతీయ సేవా పురస్కారమును ట్రస్టు ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ పూసపాటి బాలాజీ



అందజేశారు. ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే వైద్య వృత్తిలో తనకంటూ గుర్తింపు పొంది ఎంతోమంది సంతానలేమి కలిగిన దంపతులకు సంతాన భాగ్యాన్ని కలిగిస్తూ ఆధ్యాత్మికంగా సామాజికంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ వరలక్ష్మి గారికి ఈ పురస్కారాన్నీ చేయడం చాలా సంతోషంగా ఉందని శ్రావణమాసం మహాలక్ష్మి మాసమని స్త్రీలను గౌరవించిన మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుందని తెలియజేశారు అనంతరం డాక్టర్ వరలక్ష్మి సిద్ధార్థ్ మాట్లాడుతూ జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్యాత్మిక సామాజికంగా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారూ అని, వారి సేవా కార్యక్రమాలు ఆదర్శనీయంగా ఉంటాయని తెలియజేశారు, పట్టణ ప్రముఖ మహిళా మణులు కల్లూరు రాజ్యలక్ష్మి, కావూరు శివ లీల పాల్గొని డాక్టర్ గారికి పసుపు కుంకుమ అందజేశారు

## చిలకలూరిపేటలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

ఆంధ్ర ప్రదేశ్ పల్నాడు జిల్లా చిలకలూరిపేట పంజాబ్ నేషనల్ బ్యాంక్ చిలకలూరిపేటలో తన నూతన శాఖను శుక్రవారం ప్రారంభించింది. పల్నాడు జిల్లా ప్రజలకు మరింత చేరువగా, సౌకర్యవంతమైన మరియు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ నూతన శాఖను ఏర్పాటు చేశారు. దీనితో మొత్తం విజయవాడ సర్కిల్ పరిధిలో 82 శాఖలుగా విస్తరించి తమ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

చిలకలూరిపేటలోని శ్రీ గౌరీ శంకర్ టవర్స్, పెదనందిపాడు బస్‌స్టాప్, కళామందిర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శాఖను శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ విజయవాడ సర్కిల్ డీజీఎం మరియు సర్కిల్ హెడ్ శ్రీమతి కవితా ఫ్రాంక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాఖ ప్రారంభ కార్యక్రమంలో చిలకలూరిపేట శాఖ బ్రాంచ్ హెడ్ శ్రీ పి. నారయ్యతో పాటు , ఏజీఎం శ్రీ రామనాథన్



గారు, శ్రీ సతీష్ గారు మరియు అసోసియేషన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ షేక్ గౌస్ గారు, యూనియన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ధన్వంత్ గారు మరియు ఇతర బ్యాంకు అధికారులు, సిబ్బంది, డాక్టర్ కొమ్మినేని వీర శంకర్ గారు, ధనలక్ష్మి కంపెనీ సాధినేని హనుమంత్ రావు గారు, కల్పతరువు చిట్స్ అది నారాయణ రెడ్డి గారు, శ్రీ గౌరీ శంకర్ టెంట్ హౌస్, గ్రానైట్ బిజినెస్ శిల్ప రెడ్డి గారు, ఖాతాదారులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీమతి కవితా ఫ్రాంక్ మాట్లాడుతూ, చిలకలూరిపేట మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేయడంలో నూతన శాఖ కీలకంగా నిలుస్తుందని అన్నారు. వ్యక్తిగత ఖాతాదారులు, వ్యాపారవేత్తలు, రైతులు మరియు స్థానిక సంస్థల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సేవలను అందించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ కట్టుబడి ఉందని తెలిపారు.

శ్రీ పి. నరయ్య మాట్లాడుతూ, చిలకలూరిపేట ప్రజలకు అత్యుత్తమమైన, వేగవంతమైన మరియు కస్టమర్-కేంద్రిత బ్యాంకింగ్ సేవలను అందించేందుకు శాఖ సిబ్బంది కృషి చేస్తారని తెలిపారు. స్థానిక ప్రజలు నూతన శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిలకలూరిపేటలో నూతన శాఖ ప్రారంభం ద్వారా పల్నాడు జిల్లాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ తన సేవలను మరింత విస్తరించడంతో పాటు స్థానిక ప్రజల ఆర్థిక అవసరాలకు మరింత చేరువైంది.

శాఖ వివరాలుపంజాబ్ నేషనల్ బ్యాంక్ -- చిలకలూరిపేట శాఖ,శ్రీ గౌరీ శంకర్ టవర్స్, పెదనందిపాడు బస్‌స్టాప్,కళామందిర్ సెంటర్, చిలకలూరిపేట -- 522616,పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## నూతన ప్రభుత్వ కార్యాలయ భవనాలతో ప్రజలకు మెరుగైన సేవలురిజిస్టేషన్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకువస్తాం..

ట్రై నెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

జగిత్యాల జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగై సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి జగిత్యాల మున్సిపాలిటి పరిధిలోని ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సి.సి.ఎల్. ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎం .డి. హౌసింగ్ గౌతం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పర్యటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఒకే రోజు జగిత్యాల జిల్లాలో రూ. 11.80కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చూడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్లు, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్ల నిధులు, భీమారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్లు, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి



రూ. 2.25 కోట్ల నిధులు, మాల్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 1.40 కోట్లు, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 1.40 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి వివరించారు.

ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అధికారులు మరియు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనువైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. కార్యాలయాల నిర్మాణంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు ప్రధాన లక్ష్యాలుగా తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీరేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యులు ఎల్ .రమణ, చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం , వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, అదనపు కలెక్టర్ లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహ రావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్, రాయికల్ మున్సిపల్ చైర్మన్, ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలూరు నియోజకవర్గ తాగునీటి సమస్యలకు దశలవారీగా పరిష్కారం దిశగా కీలక సమావేశం.

ట్రైనెట్ న్యూస్ 21 ఆగస్టు 2026

ఆలూరు నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తెర్నేకల్ వెంకప్ప ఉప ముఖ్యమంత్రి కార్యాలయం మరియు విజయవాడ ఈ ఎన్ సి కార్యాలయంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు, ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తెర్నేకల్ వెంకప్ప 19 ఆగస్టు 2026న కర్నూలులో జిల్లా ఆర్ డబ్ల్యు ఎస్. ఎస్ ఈ మనోహర్ , ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఈ శ్రీమతి పద్మజ, ఆలూరు మరియు ఆదోని డివిజన్ల ఆర్ డబ్ల్యు ఎస్ డీ.ఈ ఈ లు, ఆలూరు నియోజకవర్గంలోని 6 మండలాల ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ లతో సమావేశమయ్యారు.ఈ సమావేశంలో



ఆలూరునియోజకవర్గంలోని తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. 1.వచ్చే వేసవిలోపు చేపట్టాల్సిన స్వల్పకాలిక చర్యలు2.రాబోయే 3 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక3.దీర్ఘకాలికశాశ్వతతాగునీటిపరిష్కారాలు4.అవసరమైన నిధుల సమీకరణకు సాధ్యమైన మార్గాలు
5.మండలాల వారీగా సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారాలు
ఈ చర్చల ఆధారంగా సమగ్ర నివేదికను త్వరితగతిన సిద్ధం చేసి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి సమర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు.
ఆలూరు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో కాకుండా, శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు జనసేనపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గురువులను కాపాడుకోవడం సమాజ బాధ్యత.

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

మహబూబాబాద్ జిల్లా (ఆగస్టు 21)కేంద్రంలో ప్రిన్సిపల్ రూపా రెడ్డి హత్యకు నిరసనగా ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్, టీచర్ల భారీ ర్యాలీ
మానుకోట: ప్రిన్సిపల్ రూపా రెడ్డి హత్యను ఖండిస్తూ మానుకోట పట్టణంలో ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్, ప్రైవేట్ టీచర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు.
ఈ సందర్భంగా ట్రస్మా మానుకోట మండల అధ్యక్షులు కమ్మగాని కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఒక ప్రిన్సిపల్‌ను విద్యార్థి హత్య చేసే స్థాయికి పరిస్థితులు చేరుకోవడం సమాజంలో క్రమశిక్షణ లోపానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవం, క్రమశిక్షణ పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని,



సెల్‌ఫోన్ వినియోగాన్ని నియంత్రించాలని సూచించారు. మార్కెట్లో విచ్చలవిడిగా లభిస్తున్న మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు గురువులను గౌరవించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.రూపా రెడ్డి హత్య జరిగి 11 రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు.



మెరుగైన సమాజ నిర్మాణంలో గురువు పాత్ర ఎంతో కీలకమని, గురువులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.
ఈ కార్యక్రమంలో ట్రస్మా సభ్యులు తక్కలపల్లి ప్రభాకర్, మల్లిరెడ్డి సుధా, ఖలీద్, మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి, రామకృష్ణ, సాబీర్, వెంకటేశ్వర్లు, పూర్ణచందర్, అనుదీప్, బిక్కి వెంకటేశ్వర్లు తదితరులు, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హోలగుంద, డ నాపురం రహదారి 30 ఏళ్ల కల. 30 రోజుల్లోనే తారు– సు– మారు!
## రూ.11.30 కోట్లతో నిర్మించిన 25.8 కి.మీ. రహదారి నాణ్యతపై ప్రజల ప్రశ్నలు.

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026:-

ఆలూరు నియోజకవర్గం పరిధిలోని హెులగుంద–డ నాపురం రహదారి దుస్థితికి చేరడంతో
దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ధణాపురం––హెబ్బటం హోళగుంద ప్రధాన రహదారి నిర్మాణం పూర్తయి నెల రోజులు కూడా గడవకముందే పలుచోట్ల తారు లేచిపోయి రోడ్డు దెబ్బతినడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.
ధణాపురం నుంచి హెబ్బటం, హోళగుంద వరకు 25.8 కిలోమీటర్ల రహదారి ఆధునీకరణకు రూ.11.30 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. అయితే నిర్మాణం పూర్తయిన కొద్ది రోజులకే పలుచోట్ల తారు లేచిపోవడం, రోడ్డు దెబ్బతినడంతో నిర్మాణ నాణ్యతపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
ఈ రహదారి దుస్థితిపై ఇప్పటికే ఆంధ్రజ్యోతి పత్రిక ప్రధాన పేజీలో “30 ఏళ్ల రోడ్డు కల 30 రోజుల్లో తారుమారు! అంటూ కథనం ప్రచురించడం ఈ వ్యవహారం తీవ్రతకు అద్దం పడుతోంది.
రోడ్డు వేస్తున్నప్పుడు నాణ్యత కనిపించలేదా?
రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలోనే బేస్‌మెంట్, మెటీరియల్, తారు నాణ్యత, పనుల ప్రమాణాలను పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, కూటమిలో భాగస్వాములుగా ఉన్న రాజకీయ నాయకులపైనా ఉంటుంది.
అప్పుడు పనులను పరిశీలించి నాణ్యతపై ప్రశ్నించి ఉంటే.. నెల రోజుల్లోనే రోడ్డు దెబ్బతినే పరిస్థితి వచ్చేదా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగామారింది.
కూటమిలో భాగస్వాములుగా ఉన్న నాయకుల



పాత్ర ఏమిటి?
ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రభుత్వం ప్రజాధనాన్ని కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నప్పుడు, ఆ పనులు నాణ్యతతో జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని గమనించడం కూటమిలో భాగస్వాములుగా ఉన్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల బాధ్యత కాదా?ప్రజాధనంతో నిర్మిస్తున్న రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం మీకు లేదా?
పనులు జరుగుతున్న సమయంలోనే సంబంధిత అధికారులను నాణ్యతపై ప్రశ్నించాల్సిన బాధ్యత లేదా?నెల రోజుల్లోనే రోడ్డు దెబ్బతిన్న తర్వాత అయినా బాధ్యులను నిలదీసి ప్రజలకు సమాధానం చెప్పించాల్సిన అవసరం లేదా?
ఇవి ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఆరోపణలు కావు. ప్రజల తరఫున ఒక ప్రశ్నించే పాత్రికేయుడిగా అడుగుతున్న సహజమైన ప్రశ్నలు.
రాజకీయాలకు మించి.. ప్రజా ప్రయోజనాలపై దృష్టి అవసరం
రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమే. కార్యకర్తల కార్యక్రమాలు, రాజకీయ విమర్శలు కూడా ప్రజాస్వామ్యంలో భాగమే.
అయితే ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులపై కూడా అదే స్థాయిలో శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.
ప్రజలు కోరేది రాజకీయ విమర్శలు కాదు.. నాణ్యమైన అభివృద్ధి.
ప్రజలు కోరేది మాటలు కాదు.. ప్రజాధనానికి న్యాయం.
అధికారుల తనిఖీతో అసలు కారణాలు వెలుగులోకి రావాలి
రహదారి దెబ్బతిన్న ప్రాంతాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి, కారణాలను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.
అయితే ప్రజల ప్రశ్న మాత్రం ఒక్కటే
నిర్మాణ సమయంలోనే లోపాలను గుర్తించి ఉంటే, రూ.11.30 కోట్లతో నిర్మించిన 25.8 కి.మీ. రహదారి ఇంత త్వరగా దెబ్బతినే పరిస్థితి వచ్చేదా?
రహదారి నిర్మాణంపై సమగ్ర సాంకేతిక తనిఖీ నిర్వహించి, నాణ్యతా లోపాలకు కారణాలను పూర్తిగా వెలుగులోకి తీసుకురావాలి. విచారణలో ఎవరైనా బాధ్యులుగా తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.
30 ఏళ్లుగా ఎదురుచూసిన రహదారి.. 30 రోజుల్లోనే తారుమారైతే, నాణ్యతను ఎవరు పరిశీలించారు? పర్యవేక్షణ ఎక్కడ జరిగింది? బాధ్యత ఎవరిది
ప్రజల డబ్బుతో నిర్మించే ప్రతి రోడ్డు ప్రజలకు ఉపయోగపడేంతకాలం మన్నికగా ఉండాలి. అభివృద్ధి పేరుతో ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి.

## అల్లీపూర్ లో చాయ్‌తో ఆత్మీయ పలకరింపు...ప్రజల నోట ఒకే మాట -- మళ్లీ కేసీఆర్ రావాలి” మాజీ జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావా వసంత సురేష్

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ గ్రామంలోని పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి చాయ్ తాగుతూ ఆత్మీయంగా ముచ్చటించారు. గ్రామంలోని సమస్యలు, ప్రజల పరిస్థితులు, అభివృద్ధి అంశాలపై వారితో మాట్లాడారు.ఈ సందర్భంగా కార్యకర్తలు, స్థానికులతో జరిగిన ఆత్మీయ సంభాషణలో రాజకీయాలపై చర్చ వచ్చినప్పుడు పలువురి నోట ఒకే అభిప్రాయం వినిపించిందని దావ వసంత సురేష్ తెలిపారు. “మళ్లీ కేసీఆర్ రావాలి... కేసీఆర్ పాలనను మరోసారి చూడాలి” అంటూ ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని



అన్నారు.కేసీఆర్ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి, రైతులు, పేదలు, మహిళలు, వృద్ధులు తదితర వర్గాలకు అందిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు.
“ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు నాయకుల గురించి ప్రజలే చెప్పే మాటే అసలైన తీర్పుకు సంకేతం. అల్లీపూర్‌లోచాయ్‌తాగుతూప్రజలతోముచ్చటిస్తుంటే.



.. వారి మాటల్లో మళ్లీ కేసీఆర్ రావాలనే ఆకాంక్ష స్పష్టంగా వినిపించింది. ఇది ఒక్క గ్రామం మాట కాదు... యాపత్ తెలంగాణ ప్రజల మనసులో ఉన్న భావనకు ఇది ప్రతిబింబం” అని దావ వసంత సురేష్ అన్నారు.చాయ్ కప్పులో చర్చ మొదలైంది... ప్రజల నోట మాట బయటకొచ్చింది...
“మళ్లీ కేసీఆర్ రావాలి!” అని అన్నారు

## వెల్దండ మండల ఎమ్మార్వోకు ఘన సన్మానం

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గాను అవార్డు అందుకున్న వెల్దండ మండల తహసీల్దార్ కార్తీక్ కుమార్ గారిని ప్రముఖ సంఘ సేవకులు ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ పాపిశెట్టి రామన్న రామన్న మిత్ర మండలి సభ్యులు శ్రీను నాయక్ ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.
తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించడంలో, మండల అభివృద్ధిలో ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తీక్ కుమార్ మాట్లాడుతూ తనకు వచ్చిన అవార్డు తన ఒక్కడిది కాదని, సిబ్బంది అందరి సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గుంటక రమేష్ హత్యా నిందితులు అరెస్ట్.



ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

మండలం మడిపల్లి గ్రామానికి చెందిన గుంటుక రమేష్43,సంవత్సరాలుతండ్రి:సోమయ్యఅనేవ్యక్తిదారుణహత్యకు,గురయ్యారు.ఈఘటనకు,సంబంధించి 13 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు విలేకరుల సమావేశంలో తొర్రూర్ డిఎస్పి కే. కృష్ణ కిషోర్,వెల్లడించారు.మృతుడు గుంటుక రమేష్, అతని సామాజిక వర్గానికి చెందిన కుల పెద్దలను తరచూ దూషిస్తూ,చంపుతా అని బెదిరిస్తూ ఉండేవారని గ్రామంలో ఒకరి 5వ రోజు సంతాప సభ,జరిగిన రోజు బోజన సమయం లో బెదిరింపులకు,పాల్పడుతున్నాడనే ఆగ్రహంతో ఒకే కులానికి చెందిన 13 మంది వ్యక్తులు ఈ దాడికి ఒడిగట్టారు.2026 ఆగస్టు 19న నిందితులందరూ కలిసి రమేష్‌పై కర్రలు,బండరాళ్లతో తీవ్రంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో పడేసినట్లు నిందితులు పోలీసుల విచారణలో అంగీకరించారు. మృతుని భార్య గుంటుక రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2026 ఆగస్టు 21న ఉదయం, ఈ కేసులో ప్రధాన నిందితుడైన (A1) కాగితపు యకయ్య ఇంటి వద్ద నిందితులంతా సమావేశమై,పారిపోవడానికి ప్రణాళికలు వేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందుకొన్న పోలీసులు, సీఐ గణేష్ ఆధ్వర్యంలో ఎస్సై మహేందర్ రెడ్డి పర్యవేక్షణలో నిందితులను వెంటనే దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నా మణి తెలిపినారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా విచారిస్తున్నామని డిఎస్పి కే. కృష్ణ కిషోర్ తెలిపారు. గ్రామంలోనిసీసీటీవీకెమెరాలఫుటేజ్‌లు,వీడియోరికార్డింగ్‌లను నిశితంగా,పరిశీలిస్తున్నామని,ఈహత్యలో,భాగస్వాములైన వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి స్పష్టం చేశారు.

## రాబోయే స్థానిక ఎన్నికలకు జిల్లాల వారీగా అభ్యర్థులను సిద్ధం చేసినట్లు తెలిపిన బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు.





ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

మార్కాపురం జిల్లా కేంద్రంలోని నెహ్రూ బజార్ లో గల భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు అధ్యక్షతన జిల్లా నాయకులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పివి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పీవీ మాధవన్ ఆదేశాల మేరకు రాబోయే స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధం చేశామని అన్నారు. కూటమి కలయికతో అన్ని ప్రాంతాలలో అభ్యర్థులను సిద్ధం చేశామని గెలుపే ధ్యేయంగా ముందుకెళున్నామని అన్నారు. అదేవిధంగా వెలుగొండ ప్రాజెక్టు జలాల కోసం నిర్వాసితుల త్యాగాలు మరువరానివని అటువంటివారిని మర్చిపోకుండా నేడు వారికి సన్మానం కూడా చేశామని చెప్పారు. త్రిబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని పోలవరం ప్రాజెక్టు కోసం ఎన్నో నిధులు సమకూర్చి ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేసే దిశగా కూటమి ప్రభుత్వం నడుస్తుందని అలాగే వెలుగొండ ప్రాజెక్టు కూడా త్వరలోనే జాతికి అంకితం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మాదినేని లక్ష్మణ్ మండల శివప్రసాద్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేవి నారాయణ బొంత బాదరయ్య గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు కొత్రపాటి రంగ లక్ష్మి,కోంద్రు పిచ్చయ్య, కార్యదర్శులు వద్దిపాటి వెంకట్ మట్టే మల్ల పుల్లయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులు పరిధి దాటి వ్యవహరించొద్దు...
## –జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి భుజంగరావు పటేల్

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026



నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని సర్పంచులు తమ అధికార పరిధిని దాటి పొరుగు గ్రామ పంచాయతీల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరికాదని నిర్మల్ జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి భుజంగరావు పటేల్, అన్నారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని పేర్కొన్నారు.ఇతర గ్రామాలపై ఆధిపత్యం చెలాయించే విధంగా వ్యవహరించడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.ప్రతి సర్పంచ్ తమ గ్రామ అభివృద్ధిపైనే దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీల మధ్య పరస్పర సహకారం, సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇతర గ్రామాల అంతర్గత వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. సర్పంచులు సమన్వయంతో పనిచేస్తూ తమ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు...

## తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.



ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

వార్తలోకం/కోరుట్ల నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 21
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను శుక్రవారం కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామంలో గ్రామ సర్పంచ్ సరికెళ్ల లతిక నరేష్ లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు జీపీఓ పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలు స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

త్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

శనివారం ,ఆగస్టు ,22, 2026

www.trinetnews.com

# ఉపసర్పంచ్‌కు మద్దతుగా రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం.

త్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026



చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామ ఉపసర్పంచ్ చింతపూల అనిల్‌ను శుక్రవారం రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ పరామర్శించారు. రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 100 మంది ఉపసర్పంచులతో కలిసి ఆయన ఇందుర్తికి వచ్చారు.

ఈ సందర్భంగా బొట్ల కార్తీక్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతిని అడ్డుకునేందుకు ప్రశ్నిస్తున్న ఉపసర్పంచ్‌ను మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పంచాయతీ సిబ్బంది జీతాల బిల్లులకు ఇతర బిల్లులను ముడిపెట్టి, ముందుగా అన్ని బిల్లులపై సంతకాలు చేసిన తర్వాతే జీతాల బిల్లులపై సంతకం చేయాలని కార్యదర్శి స్వర్ణలత ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఉపసర్పంచ్ సిబ్బంది జీతాలపై సంతకాలు చేయడం లేదంటూ ఎంపీడీవో కార్యాలయం, ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు.

ఈ వ్యవహారంపై కరీంనగర్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వెంటనే స్పందించి, కార్యదర్శి స్వర్ణలతపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దూస కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపగోని నవీన్ కుమార్ గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆకుబత్తిని విజయ్ కుమార్, జనగామ జిల్లా అధ్యక్షుడు పండుగ హరీష్ ముదిరాజ్, వివిధ మండలాల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు, వివిధ గ్రామాల ఉపసర్పంచులు, ఇందుర్తి వార్డు సభ్యులు తిరుపతి, కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభలకు సీఐ, ఎస్సై కు ఆహ్వానం



త్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

మదనపల్లెలో ఈ నెల 23న ఆదివారం జరగనున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలకు పుంగనూరు అర్బన్ సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ కె.వి.రమణలను యూనియన్ నాయకులు శుక్రవారం ఆహ్వానించారు. పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అనంతరం మహాసభల ఆహ్వాన పత్రికలను అందజేసి, కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిపరమైన ఇబ్బందులు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆంధ్రజ్యోతి గిరి, ఎన్టీవీ సలీం, ఆంధ్రప్రభ సీనా, ఆర్‌టీవీ సైపుల్లా, టెన్‌టీవీ జగదీష్, షామీర్, రాజ్ న్యూస్ అప్ప, బీసీ అండ్ టీవీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో దొంగతనం





**- రూ.12 వేల నగదు, మూడు తులాల బంగారం ,వెండి అపహరణ**

**- క్లూస్ టీమ్ ద్వారా వేలి ముద్రలు సేకరణ**

త్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

చిగురుమామిడి:తాళం వేసి ఉన్న ఇంటినే లక్ష్యంగా చేసుకుని దొంగలు తమ చేతివాటం ప్రదర్శించిన సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. తాళం వేసి బంధువుల ఊరు వెళ్లిన సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించారు. బాధితుడు సూరం ప్రతాపరెడ్డి వెల్లడించిన కథనం ప్రకారం.. దాదాపు పది రోజుల కిందట కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారు. అయితే శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉన్నట్లు గమనించిన పొరుగింటి వారు ప్రతాపరెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వెంటనే చేరుకుని చూడగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు స్పష్టమైంది. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. కరీంనగర్ జిల్లా క్లూస్ టీమ్ రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు.

సుమారు 3 తులాల బంగారం, బంగారు చెవికమ్మలు, 5 తులాల వెండి వస్తువులతో పాటు రూ. 12 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దుండగుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు.

# పవన్ పుట్టినరోజుకు పేద కుటుంబానికి ఇల్లు





త్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

పుంగనూరు: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పేద, ఇల్లు లేని కుటుంబానికి సొంత నిధులతో ఇల్లు నిర్మించి అందించనున్నట్లు కర్ణాటక జనసేన సాధక్ టీం సభ్యులు శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 2న పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల నిర్వహణపై కర్ణాటక జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌తో సుబ్బు ఆధ్వర్యంలోని టీం సభ్యులు చర్చించారు. జనసేన 21 ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో ఏటా పవన్ పుట్టినరోజున పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి గృహప్రవేశం చేయిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కోలార్ జిల్లా ముల్బాగల్ తాలూకా గుడిపల్లి పంచాయతీ వలికిరి గ్రామంలో వృద్ధురాలు,

అంగవైకల్యంతో ఉన్న ఆమె కుమారుడు వేణు పూరిగుడిసెలో నివసిస్తున్న విషయాన్ని గుర్తించి సుమారు రూ. 5 లక్షలతో ఇల్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది నాచిపల్లి గ్రామానికి చెందిన నరసింహకు ఇల్లు నిర్మించి గృహప్రవేశం చేయించినట్లు సుబ్బు తెలిపారు. కార్యక్రమంలో జీవి ఆనంద్, దినేష్, మునీంద్ర, మునిరాజు, శంకర్, ఎన్‌పీఎస్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా వరలక్ష్మి వ్రతకల్పం



త్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026

చింతపల్లి మండలం కురుమేడు గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాతృ శక్తి సత్సంగ ప్రముఖ్ నాదిరి స్వప్న గారి నిర్వహణలో మాతృ శక్తి విభాగం వారు వరలక్ష్మి వ్రతకల్పం పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# విశాఖ వేదికగా ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత సమన్వయ సమావేశం

## 32 అనుబంధ సంస్థల ప్రతినిధులతో మూడు రోజుల కీలక భేటీ -- సామాజిక, జాతీయ అంశాలపై విస్తృత చర్చ

త్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026




ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జాతీయ స్థాయి కీలక సమావేశానికి వేదికగా నిలిచింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే అఖిల భారత సమన్వయ సమావేశం ఈ ఏడాది విశాఖపట్నం సమీపంలోని గుడిలోవలో ప్రారంభమైంది. ఆగస్టు 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజులపాటు జరుగుతున్న ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా సంఘ్ ప్రేరణతో పనిచేస్తున్న 32 సంస్థలకు చెందిన ప్రముఖ ప్రతినిధులు హాజరయ్యారు.

విజ్ఞాన విహార్ పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ఈ సమావేశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ప్రారంభించారు. ప్రభుత్వాహ్ దత్తాత్రేయ హొసబళే, సహ ప్రభుత్వాహ్‌లు, కేంద్ర స్థాయి ముఖ్య బాధ్యులు సమావేశంలో పాల్గొంటున్నారు. దేశవ్యాప్తంగా సామాజిక రంగంలో పనిచేస్తున్న వివిధ సంస్థల మధ్య సమన్వయం, పరస్పర సహకారం మరింత బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా ఆర్‌ఎస్‌ఎస్ వెల్లడించింది.

**32 సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యం**

ఈ సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్, భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, రాష్ట్ర సేవికా సమితి తదితర సంఘ్ ప్రేరిత సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారు. సుమారు 327 మంది ప్రతినిధులు, బాధ్యులు ఈ సమావేశంలో పాల్గొంటున్నట్లు సమాచారం. వీరిలో మహిళా ప్రతినిధులు కూడా ఉన్నారు.

వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంస్థలు తమ కార్యకలాపాలు, అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై తమ అభిప్రాయాలను సమావేశంలో పంచుకుంటాయి. ప్రజా జీవితాన్ని ప్రభావితం చేస్తున్న వివిధ అంశాలపై పరస్పరం చర్చించుకోవడానికి ఈ సమావేశం ఒక వేదికగా ఉపయోగపడుతోంది.

**జనాభా మార్పులపై ప్రత్యేక చర్చ**

దేశంలో చోటుచేసుకుంటున్న జనాభా మార్పులు, వాటి వల్ల ఉత్పన్నమయ్యే సామాజిక పరిణామాలు సమావేశంలో చర్చకు వచ్చిన ముఖ్య అంశాల్లో ఒకటిగా ఉన్నాయి. జనాభా సమతుల్యత, భవిష్యత్తులో సమాజంపై పడే ప్రభావం, వివిధ ప్రాంతాల్లోచోటుచేసుకుంటున్న జనాభా మార్పులను అధ్యయనం చేయాల్సిన అవసరంపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు తెలిపాయి. జనాభా అంశాన్ని కేవలం సంఖ్యల పరంగా కాకుండా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కోణాల్లో పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశ భవిష్యత్తు ప్రణాళికల్లో జనాభా మార్పులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని సమావేశం ప్రాధాన్యంగా చర్చిస్తోంది.

**యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై ఆందోళన**

యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం కూడా సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్న మరో అంశం. యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న ఈ సమస్యపై సామాజిక సంస్థలు మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు భావిస్తున్నారు. మాదకద్రవ్యాల నుంచి యువతను దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు, కుటుంబ స్థాయి చైతన్యం, విద్యాసంస్థల పాత్ర వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి.

దేశ నిర్మాణంలో యువత కీలక శక్తి. అందువల్ల యువతలో ఆరోగ్యకరమైన జీవన విధానం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరంపై సమావేశం దృష్టి సారించింది.

**పంచ పరివర్తన్‌కు ప్రాధాన్యం**

సామాజిక సామరస్యం, కుటుంబ వ్యవస్థ బలోపేతం, పర్యావరణ పరిరక్షణ, స్వ భావన, పౌర కర్తవ్యాల నిర్వహణ వంటి అంశాలను కలిపి పంచ పరివర్తన్ కార్యక్రమానికి కూడా సమావేశంలో ప్రాధాన్యం ఇస్తున్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించాలని ఈ కార్యక్రమం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ ప్రస్తావిస్తోంది.

కుటుంబ వ్యవస్థ బలపడితే సమాజం బలపడుతుందని, సామాజిక సామరస్యం పెరిగితే దేశ ఐక్యత మరింత పటిష్ఠమవుతుందని సంఘ్ భావిస్తోంది. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం కూడా భవిష్యత్ కార్యాచరణలో భాగంగా చర్చకు వచ్చింది.

**భారతీయ అభివృద్ధి నమూనాపై చర్చ**

అభివృద్ధిని కేవలం ఆర్థిక వృద్ధితో మాత్రమే కొలవకుండా, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, సాంస్కృతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలనే భారతీయ అభివృద్ధి భావనపై సమావేశంలో చర్చ జరుగుతోంది.

దేశ అభివృద్ధిలో గ్రామీణ ప్రాంతాలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, యువత తదితర వర్గాల పాత్రను సమన్వయం చేయాల్సిన అవసరాన్ని వివిధ సంస్థలు తమ అనుభవాల ఆధారంగా వివరించనున్నాయి.

**నిర్ణయాల కంటే సమన్వయానికే ప్రాధాన్యం**

ఈ సమావేశం ఒక నిర్ణయాధికార సంస్థ సమావేశం చర్చిస్తోంది.

కాదని, వివిధ సంఘ్ ప్రేరిత సంస్థలు తమ కార్యకలాపాలను పరస్పరం పంచుకుని, అనుభవాలను తెలుసుకుని, భవిష్యత్‌లో మరింత సమన్వయంతో పనిచేయడానికి ఏర్పాటు చేసిన వేదిక అని ఆర్‌ఎస్‌ఎస్ స్పష్టం చేసింది.

వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంస్థల మధ్య సమాచార మార్పిడి పెరగడం ద్వారా ప్రజా సమస్యలను మరింత సమర్థంగా పరిష్కరించే అవకాశాలు ఏర్పడతాయని భావిస్తున్నారు. అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వాలు, ప్రజా సంస్థలు, సామాజిక వర్గాలతో సంభాషణ కొనసాగించడంపైనా సమావేశంలో చర్చ జరుగుతోంది.

**యువతతో అనుసంధానంపై దృష్టి**

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ప్రస్తుత కాలంలో యువతతో సంస్థలు ఎలా అనుసంధానం కావాలి అనే అంశం కూడా ప్రాధాన్యం పొందుతోంది. ముఖ్యంగా కొత్త తరం ఆలోచనా విధానం, వారి ఆశయాలు, సామాజిక బాధ్యత, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచే మార్గాలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

యువతలో సేవాభావం, సామాజిక చైతన్యం, దేశం పట్ల బాధ్యత పెంపొందించేందుకు ఆధునిక సాంకేతిక వేదికలను కూడా ఉపయోగించుకోవాలనే దిశగా ఆలోచనలు కొనసాగుతున్నాయి.

**విశాఖకు జాతీయ స్థాయి గుర్తింపు**

ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత సమన్వయ సమావేశం విశాఖపట్నంలో నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి జాతీయ స్థాయి ప్రాధాన్యం లభించింది. దేశం నలుమూలల నుంచి ప్రముఖ ప్రతినిధులు విశాఖకు రావడంతో నగరంలో ప్రత్యేక వాతావరణం నెలకొంది.

విశాఖపట్నం ఇప్పటికే పారిశ్రామిక, విద్యా, రక్షణ, సముద్ర రంగాల్లో ప్రముఖ నగరంగా గుర్తింపు పొందింది. ఇలాంటి జాతీయ స్థాయి సమావేశాలకు వేదికగా నిలవడం నగర ప్రతిష్ఠను మరింత పెంచుతోంది.

మూడు రోజులపాటు జరుగుతున్న ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత సమన్వయ సమావేశం ఆగస్టు 21వ తేదీ సాయంత్రంతో ముగియనుంది. జనాభా మార్పులు, యువతలో మాదకద్రవ్యాల సమస్య, సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, పౌర కర్తవ్యాలు, భారతీయ అభివృద్ధి భావన వంటి అంశాలపై జరిగిన చర్చలు భవిష్యత్ సామాజిక కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయనున్నాయి.దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంస్థలు ఒకే వేదికపై తమ అనుభవాలను పంచుకోవడం ఈ సమావేశం ప్రత్యేకత. విశాఖ వేదికగా జరిగిన ఈ అఖిల భారత సమన్వయ సమావేశం సామాజిక అంశాలపై దేశవ్యాప్త చర్చకు దోహదపడుతుందా, భవిష్యత్ కార్యాచరణలో ఎలాంటి మార్పులు తీసుకువస్తుందా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

# షావుకారు జానకి కన్నుమూత

## ఏడు దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు -- దక్షిణాది చిత్రసీమలో విషాదం

త్రై నెట్ న్యూస్ । 21 ఆగస్టు 2026ప్రత్యేక కథనం



దక్షిణ భారతీయ చిత్రసీమలో మరో మహానటి అధ్యాయం ముగిసింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో తనదైన నటనతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. 94 ఏళ్ల వయసులో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా ఆమెకు చికిత్స అందిస్తున్న సమయంలో ఆరోగ్యం విషమించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది.

షావుకారు జానకి అసలు పేరు శంకరమంచి జానకి. 1931 డిసెంబర్ 12న రాజమండ్రిలో జన్మించిన ఆమె చిన్న వయసులోనే కళారంగంపై ఆసక్తి పెంచుకున్నారు. కేవలం 11 ఏళ్ల వయసులోనే రేడియో కార్యక్రమాల ద్వారా తన కళా ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత రంగస్థలంపై అడుగుపెట్టి తన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం వెండితెరపైకి ప్రవేశించి దాదాపు ఏడు దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించారు.

**'షావుకారు'తో మొదలైన ప్రస్థానం**

1950లో విడుదలైన 'షావుకారు' చిత్రం ఆమె సినీ జీవితానికి కీలక మలుపుగా నిలిచింది. ఆ సినిమా పేరే తరువాత ఆమెకు శాశ్వత గుర్తింపుగా మారింది. అప్పటి నుంచి ఆమె 'షావుకారు జానకి'గా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థిరపడిపోయారు.ఆమె నటనలో సహజత్వం ప్రత్యేక ఆకర్షణ. కథానాయికగా మాత్రమే కాకుండా తల్లి, అత్త, భార్య, కుటుంబ పెద్ద, భావోద్వేగ పాత్రలు, హాస్య పాత్రలు, గంభీరమైన పాత్రలు ఇలా ఎన్నో విభిన్నమైన పాత్రలకు జీవం పోశారు. ఒకే రకమైన పాత్రలకు పరిమితం కాకుండా తన నటనా పరిధిని నిరంతరం విస్తరించుకున్న అరుదైన నటీమణుల్లో ఆమె ఒకరు.నాలుగు భాషల్లో నాలుగు దశాబ్దాలు కాదు... ఏడు దశాబ్దాలుషావుకారు జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కలిపి 400కు పైగా చిత్రాల్లో నటించినట్టు పలు నివేదికలు పేర్కొన్నాయి. దాదాపు ఏడు దశాబ్దాల పాటు కొనసాగిన ఆమె సినీ ప్రస్థానం దక్షిణ భారతీయ చిత్ర చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

తెలుగులో ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి అగ్ర నటులతో కలిసి నటించిన ఆమె తమిళంలో ఎంజీఆర్, శివాజీ గణేశన్ తదితర దిగ్గజ నటులతో తెరను పంచుకున్నారు. ఒకే తరానికి చెందిన నటులతో మాత్రమే కాకుండా తరువాతి తరాల నటులతోనూ కలిసి పనిచేసి తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు.

ఎన్టీఆర్, ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత వంటి ప్రముఖులతో తెరను పంచుకున్న అరుదైన నటిగా కూడా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

**గుర్తుండిపోయే చిత్రాలు**

షావుకారు జానకి నటించిన చిత్రాల్లో అనేక సినిమాలు తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. 'రోజులు మారాయి', 'కన్యాశుల్కం', 'జయం మనదే', 'పాండురంగ మహాత్మ్యం', 'డాక్టర్ చక్రవర్తి', 'అక్కాచెల్లెలు', 'బడిపంతులు', 'సంసారం ఒక చదరంగం' వంటి చిత్రాలు ఆమె నటనా ప్రతిభకు నిదర్శనాలుగా నిలిచాయి.

తరువాతి తరాల్లోనూ ఆమె తన నటనను కొనసాగించారు. 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' ఆమె చివరి చిత్రంగా నిలిచింది. అంటే తెరపై ఆమె ప్రయాణం ఏడు దశాబ్దాలకు పైగా కొనసాగింది.

**అవార్డులు, సత్కారాలు**

సినీ రంగానికి ఆమె చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. తమిళనాడు ప్రభుత్వం నుంచి కళైమామణి, ఆంధ్రప్రదేశ్ నుంచి నంది పురస్కారాలు, ఇతర అనేక జీవిత సాఫల్య పురస్కారాలు ఆమెను వరించాయి. ఫిల్మ్‌ఫేర్ జీవిత సాఫల్య పురస్కారం కూడా ఆమె అందుకున్నారు.

అవార్డుల కంటే గొప్పగా ఆమె సంపాదించుకున్నది ప్రేక్షకుల అభిమానమే. పాత్ర ఏదైనా, వయసు ఏదైనా, భాష ఏదైనా తన సహజమైన నటనతో ఆ పాత్రను ప్రేక్షకులకు దగ్గర చేయగలిగిన సామర్థ్యం ఆమె ప్రత్యేకత.

ఒక యుగానికి ముగింపు

షావుకారు జానకి మృతి కేవలం ఒక ప్రముఖ నటి మరణం కాదు. తెలుగు, తమిళ చిత్రసీమల్లో ఒక గొప్ప నటనా సంప్రదాయానికి చెందిన ఒక తరం ముగిసినట్లుగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. సహజ నటనకు ప్రాధాన్యం ఉన్న కాలంలో ఎదిగి, మారుతున్న సినిమా ప్రపంచానికి అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ చివరి దశ వరకు నటిగా కొనసాగడం ఆమె ప్రత్యేకత.

ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో విషాదం నెలకొంది. పలువురు సినీ ప్రముఖులు ఆమెతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు. చిరంజీవి ఆమెను గొప్ప నటిగా కొనియాడగా, బాలకృష్ణ తమ నందమూరి కుటుంబంతో ఆమెకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇతర ప్రముఖులు కూడా ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు.

**ప్రేక్షకుల గుండెల్లో చిరస్థానం**

సినిమా వచ్చి పోతుంది. నటులు వస్తారు, వెళ్తారు. కానీ కొన్ని పాత్రలు, కొన్ని నటనలు మాత్రం కాలంతో పాటు నిలిచిపోతాయి. షావుకారు జానకి అలాంటి అరుదైన కళాకారిణి.

ఆమె నటించిన పాత చిత్రాలను ఈ తరం ప్రేక్షకులు చూసినా, ఆమె నటనలో కనిపించే సహజత్వం ఇప్పటికీ ఆకట్టుకుంటుంది. సంభాషణ చెప్పే విధానం, భావోద్వేగాలను వ్యక్తీకరించే తీరు, పాత్రలోకి పూర్తిగా ప్రవేశించే సామర్థ్యం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి.

షావుకారు జానకి ఇక మన మధ్య లేకపోయినా, ఆమె పోషించిన పాత్రలు, ఆమె నటన, ఆమె అందించిన కళా సంపద మాత్రం ఎప్పటికీ మనతోనే ఉంటాయి.

దక్షిణ భారతీయ చిత్రసీమకు ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం. ఆమె మరణం సినీ ప్రపంచానికి తీరని లోటు.

త్రై నెట్ న్యూస్ తరపున మహానటి షావుకారు జానకికి ఘన నివాళులు.

ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు మనఃపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాము.

## లోకేశ్వరంలో నూతన ఆరే మరాఠా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

లోకేశ్వరం మండలంలోని నూతన ఆరే మరాఠ సంఘం నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మరాఠా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ పటేల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాజీరావు పటేల్ భైంసా అధ్యక్షులు మోహన్ రావు సర్పంచులు భుజంగ్ రావు సునీల్ పటేల్ గంగాధర్ పటేల్ లోకేశ్వరం మండల అధ్యక్షులు క దం శ్రీనివాస్ రావు ప్రధాన కార్యదర్శి సునీల్ సంతోష్ కోశాధికారి



కదం శ్రీకాంత్ గౌరవ అధ్యక్షులు కళ్యాణ్ ప్రకాష్ ఆయా గ్రామాల మరాఠా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పత్తికొండ, గుత్తి రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం, 70 గొర్రెలు మృతి. లబోదిబో మంటున్న గొర్రెల కాపరులు.







ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం పరిధిలోని పత్తికొండ- గుత్తి రహదారిపై మదనంతపురం, గిరి గట్ల రాజస్థాన్ డాబా సమీపంలో ఎద్దుల లోడుతో వెళుతున్న ఐచర్ వాహనం ఏపీ04యు బి 1191 నెంబరు గల వాహనం రోడ్డు రహదారిపై వెళ్తున్న గొర్రెల మందపై దూసుకుపోవడంతో సుమారు 70 గొర్రెలు ప్రమాదంలో చనిపోయి నట్లు స్థానిక ప్రజలు గొర్రెల కాపరులు తెలియజేశారు. గొర్రెలను కోల్పోయిన గొర్రెల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని స్థానిక ప్రజలు గొర్రెల యజమానులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రజలు తెలియజేశారు. రాబోవు దినాలలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డుపై వేగ నియంత్రణ జరిగే విధంగా రోడ్డు భవనాలు అధికారులు చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గొర్రెల యజమానులు కోరారు.

## భూసేకరణపై సంయుక్త సర్వే



ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

ఎన్‌హెచ్-167ఏ రహదారి నిర్మాణం కోసం తమ భూమిని అదనంగా సేకరించారని, అందుకు నష్టపరిహారం ఇప్పించాలని కంభంపాడు, మాచర్ల గ్రామాలకు చెందిన గాదె శ్రీనివాసరెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్ నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్.. క్షేత్రస్థాయిలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని మాచర్ల తహసీల్దార్, నేషనల్ హైవే అథారిటీస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మాచర్ల తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ ఏఈ ప్రకాష్ సంయుక్తంగా సంబంధిత భూముల్లో సర్వే నిర్వహించారు. భూమికి సంబంధించిన రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. భూసేకరణకు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం పూర్తి వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

## అత్యంత వైభవంగా వరలక్ష్మి వ్రత పూజలు



ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

శ్రావణ మాస వరలక్ష్మి వ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పలనాడు జూనియర్ కళాశాలలోని విద్యార్థినిలు భక్తిశ్రద్ధలతో, కులమతాలకు అతీతంగా లక్ష్మీదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తి పాటలతో, శ్లోకాలాపన చేస్తూ సాగిన కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది

కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఐకమత్య భావన, మంచి భక్తి భావాలను, ఆధ్యాత్మిక చింతన తో మనోభావాలను పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి, ప్రిన్సిపాల్ నూతలపాటి శివ భాస్కర్ తెలిపారు. కళాశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, విద్యార్థినీ విద్యార్థులకు , వారి కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమములో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాధాకుమారి, మధురవాణి, మేరీ రాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డోర్నకల్ డబ్ల్యూ జే ఐ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

డోర్నకల్ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ జే ఐ) నాయకులు పిలుపునిచ్చారు. డోర్నకల్ మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గార్ల మండలంలోని మర్రిగూడెం గ్రామంలోని శ్రీ వేట వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన డబ్ల్యూ జే ఐ సమావేశానికి జిల్లా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాల కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డోర్నకల్ మండలం నూతన అధ్యక్షుడిగా మారబోయిన నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా భయ్యా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మంద ప్రకాష్, కోశాధికారిగా అజ్మీర సక్రం, సహాయ కార్యదర్శిగా భూక్య యువరాజు ఎన్నికయ్యారు.

కమిటీ సభ్యులుగా పిట్టల సర్వేష్, నలమాస మహేష్, కొలిపాక విజయ్, కొప్పుల సత్యనారాయణ, గౌని యాకయ్య, కృష్ణలను ఎన్నుకున్నారు.

అనంతరం నూతన కమిటీ సభ్యులను ధారావత్ నరేష్ లక్ష్మీనారాయణ వ్యాస్, లాకన్, సన్మానించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నూతన కమిటీ ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌హనుమాండ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలోజిల్లాకోశాధికారి రాచగొల్ల సత్యనారాయణ,

బండ రాజకుమార్, తక్కల్లపల్లి శ్రీనివాస్, కొండి సాయికిరణ్, శివరామకృష్ణ, హెచ్. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గుండా సురేష్



ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

తొర్రూరు(ఆగస్టు 21)మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు గుండా సురేష్ ను బీజేపీ ఓబీసీ మోర్చా మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఓబీసీ జిల్లా నూతన ఉపాధ్యక్షుడు గుండా సురేష్ మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి, జిల్లా పదవి అప్పగించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు లేగా రామ్మోహన్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవి మరియు బీజేపీ జిల్లా, మండల, గ్రామ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన పదవిని వమ్ము చేయకుండా బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## సర్పంచ్ ,రైతుల కోరిక మేరకు సాగునీళ్ళకు మినీ లిఫ్ట్

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

వనపర్తి జిల్లా వనపర్తి మండలం కిష్టగిరి గ్రామానికి బిఆర్ఎస్ పార్టీ హయాంలో గ్రామ సర్పంచ్ ,రైతుల కోరిక మేరకు సాగునీళ్ళకు మినీ లిఫ్ట్ కావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ని కి విజ్ఞప్తి చేస్తే మా గ్రామానికి నీళ్లు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు.

మండల నాయకులు కే మాణిక్యం,

మానాజీపేట.రఘు వర్ధన్ రెడ్డి, దేవర్ల నరసింహ మాట్లాడుతూ గతంలో కానాయిపల్లి దగ్గర 2017లో రిజర్వాయర్ పూర్తికానందున ఒక ఉపాధ్యాయ ఎంతో రింగుబండ్ తీసుకువచ్చి డైవర్షన్ పండు ద్వారా కిష్టగిరి సర్పంచ్ పదమ్మ వెంకటయ్య మాకు ఏ అభివృద్ధి నిధులు ఇవ్వకపోయినా మా చెరువుకు నీళ్లు కావాలన్నారు. మాకు సాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. మాకు ఒక లిఫ్టు వచ్చే విధంగా చూడాలన్నారు 2016లో కిష్టగిరి గ్రామం ఎత్తు



ప్రాంతంలో ఉంది .కాబట్టి ఏదో ఒక విధంగా నీళ్లు ఇవ్వాలని 2022లో నిరంజన్ రెడ్డి మంత్రిగాలి ఉన్నప్పుడు తన ప్రాబల్యంతో సిఎస్ఆర్ స్కీం కింద నిధులు ఇచ్చి లిఫ్ట్ చేశారు ఇప్పుడు నీళ్లు వచ్చాయి. దానితోపాటు64 చిన్న లిఫ్టులు మంజూరు చేశారు .ప్రతి ఎకరానికి నీళ్లు ప్రతి రైతుకు పని అనే నినాదంతో పనిచేశారు. ఏ పొలం బీడు ఉండకూడదు అనిలిఫ్టులు, కాలువలు ,చెరువులకు నీళ్లు తెచ్చారు .కాలువల వెంబడి పార్టీ కార్యకర్తలను లస్కర్ లాగా తిప్పేవాడు ఎలాంటి లాభా పేక్ష లేకుండా కార్యకర్తలు పని చేశారు .అందుకే ఆయన నీళ్ల నిరంజన్ రెడ్డి అయ్యాడని రైతుబంధు, రైతు బీమా ,గిట్టుబాటు ధరలు అన్నీ కూడా ప్రజలకు కష్టం కలగకుండా చేశారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రైతులకు చెందిన సహాయం మరువలేనిదని అన్నారు .

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ వెంకటయ్య, మండల నాయకులు ధర్మనాయక్, మాధవరెడ్డి, దేగ మహేశ్వర్ రెడ్డి, నరేష్, శంకర్, చిట్యాల రాము, అంజి, గ్రామ పార్టీ నాయకులు వెంకటయ్య కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సేవే లక్ష్యంగా.. వనల్ పహాడ్ అభివృద్ధి బాటలో సర్పంచ్ దంపతులు

### విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి వస్తే మార్పు సాధ్యమేనని నిరూపణ మౌలిక వసతులు, విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే కాకుండా.. ఆ నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు వనల్ పహాడ్ గ్రామ సర్పంచ్‌యంపల్లి నాగలక్ష్మివినోద్ దంపతులు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారు. యువత రాజకీయాల్లోకి వస్తే కేవలం పదవులకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టవచ్చని తమ పనితీరుతో చాటుతున్నారు.

**ఎన్నికల విజయంతో బాధ్యత మరింత పెరిగింది**

2025 గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ నేపథ్యంలో యంపల్లి నాగలక్ష్మి సర్పంచ్ పదవికి పోటీ చేశారు. 1,455 మంది ఓటర్లు ఉన్న గ్రామంలో ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలవగా, నాగలక్ష్మి 230 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా గ్రామ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులపై దృష్టి సారించారు.

**చదువు.. ప్రజాసేవకు తోడైన అనుభవం**

సర్పంచ్ నాగలక్ష్మికి భర్త యంపల్లి వినోద్ విద్యావంతుడైన యువ నాయకుడిగా గ్రామ రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. మ, , ఎల్.ఎల్.బి. విద్యార్హతలు కలిగిన ఆయనకు విద్యా రంగంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉంది. గ్రామ ప్రజల అవసరాలను తెలుసుకుంటూ సర్పంచ్‌కు అండగా నిలిచి అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, అమలులో సహకరిస్తున్నారు.

**రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం**

గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సీసీ రోడ్లకు



రూ.50 లక్షలు, వీవో భవనానికి రూ.10 లక్షలు, ప్రభుత్వ పాఠశాల బౌండరీ వాల్‌కు రూ.10 లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. అలాగే గ్రామానికి రూ.30 లక్షలతో గోదాం మంజూరు చేయించేందుకు కృషి చేశారు.

**పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల అండ**

గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఈజీఎస్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రి ఖర్చులు భరించలేని పేదలకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు చేపడుతున్నారు.

**ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో అవగాహన**

గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు 'బడిబాట' కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను వివరించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా ప్రోత్సహిస్తున్నారు. విద్యతోనే గ్రామ భవిష్యత్తు మారుతుందనే ఉద్దేశంతో పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

**పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం.. ఆరోగ్యంపై శ్రద్ధ**

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు 'డ్రై డే/ఫ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వార్డుల వారీగా పారిశుద్ధ్య పనులు, సానిటైజేషన్ చేపడుతున్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి**

గ్రామాభివృద్ధిలో ఉపసర్పంచ్ బొప్పారం సాయిరెడ్డి, వార్డు సభ్యుల సహకారం కూడా లభిస్తోందని సర్పంచ్ దంపతులు చెబుతున్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడంతో పాటు గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

పదవి కోసం కాదు.. ప్రజల కోసం పనిచేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న యంపల్లి నాగలక్ష్మివినోద్ దంపతులు వనల్ పహాడ్ గ్రామాభివృద్ధిలో తమదైన ముద్ర వేయడానికి కృషి చేస్తున్నారు. విద్య, సంక్షేమం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను సమన్వయం చేస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు.

## 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోండి:-జి.సుభద్రమ్మ (తహసిల్దార్)

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) మార్గదర్శకాల మేరకు, 01.07.2026ను అర్హత తేదీగా నిర్ణయించి రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ ఐ ఆర్-2026)లో భాగంగా, 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతున్న నేపథ్యంలో, ఆగస్టు-22, 23, 29 మరియు 30 తేదీలలో (శనివారాలు, ఆదివారాలు) పాములపాడు మండలంలోని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు ఏఈఆర్ఓ/ తహసిల్దార్ జి.సుభద్రమ్మ విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ జి.సుభద్రమ్మ మాట్లాడుతూ ప్రత్యేక ప్రచార దినాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారి (బి ఎల్ ఓ) ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో



ఉంటారన్నారు. బిఎల్ఓ లు తమ వద్ద ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8, ఫారం-8ఏ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా మరియు ఏఎస్ డిడి జాబితా తదితర వివరాలతో పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని అందిస్తారనీ అన్నారు.

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేరు లేని, అర్హత కలిగిన వ్యక్తులు ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో ఫారం-6 ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చు అని అన్నారు. అలాగే, ఓటర్ల జాబితాలో పేర్లు / వివరాలకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నవారు ఫారం-7 ద్వారా, వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైన వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన యువ ఓటర్లు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా ప్రత్యేకంగా ప్రోత్సహించాలని సూచించారు.

## శ్రావణ మాసం శ్రీ వరలక్ష్మి వ్రతం నవమి సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు.







ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

పంచామృత అభిషేకం గాజుల అలంకరణ అమ్మ వారికి ముడుపు సమర్పణ శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో, చింత కుంట చెరువు దగ్గర, జగిత్యాల కుంకుమ పూజలు పంచామృత అభిషేకం జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో శ్రావణ మాసంశ్రీవరలక్ష్మివ్రతంశుక్రవారం నవమిపర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, పాలభిషేకం లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు.

పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. శ్రావణ మాసం సందర్భంగా కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ముగ్గురిని ఎంపిక చేసి వారికి బహుమతులు యివ్వడం జరిగినది. అలాగే అమ్మ వారి శేష వస్త్రం మరియు అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించడం జరిగినది. తదనంతరం లిఅమ్మ వారికి ముడుపులు కట్టారు

ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, సహయ కార్యదర్శి భారతాల సాగర్- గీత, మహిళా సభ్యులు వడ్ల గట్ల స్వాతి, అంజలి, కావ్య, ప్రసన్న, రజిత, పుష్పలత, లక్ష్మి, యశోద, జ్యోతి, ఉషారాణి, సన్నిహిత, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు జగిత్యాలలో రెవెన్యూ, గృహ నిర్మాణం, ఐ&పీఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి







ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సి.సి.ఎల్.ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎం.డి. గౌతమ్, వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఆర్డీవో కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు.

గత ప్రభుత్వం నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం చేసిందని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటు కోసం త్వరలోనే నిధులు విడుదల చేస్తామని చెప్పారు.

నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. కాలనీలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2008లో పునాది వేసిన కాలనీలో 18 సంవత్సరాల తర్వాత ప్రజలకు అవసరమైన సౌకర్యాలతో ఇళ్లు అందించగలిగామని చెప్పారు.

కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి పత్రికా ప్రకటన ఇచ్చి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ఎలాంటి ఆందోళనలు, పోరాటాలు అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు.

భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

భూ రీ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి భూ రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో కూడా ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే అనంతరం అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ పాస్ పుస్తకాలను గుర్తించి రద్దు చేస్తామని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు ప్రయోజనాలు పొందేందుకు అర్హత లేని వారికి, నకిలీ పాస్ పుస్తకాల ఆధారంగా ప్రయోజనాలు అందిన పరిస్థితులు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. భూ రీ సర్వే అనంతరం నిజమైన రైతుల హక్కులను పరిరక్షిస్తూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ,ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో పెండింగ్ పనులు పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించేందుకు రూ.72 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పాత, ప్రస్తుతం వినియోగంలో లేని ట్రాక్టర్ ఉన్న కారణంగా కొందరు అర్హులు నష్టపోతున్నారని తెలిపారు. అలాంటి అర్హులైన కుటుంబాలకు నిబంధనల్లో సడలింపు కల్పించాలని రెవెన్యూ మంత్రిని కోరారు.

ధర్మపురి ప్రజల చిరకాల కోరిక అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, ధర్మపురిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయాలని మంత్రి పొంగులేటిని కోరారు. మాల్యాల మండలంలో చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు.

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ,నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాలనీలో ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాలనీలో రహదారులు, చర్చ్, ఆలయం, మసీదు, రేషన్ దుకాణం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నూకలపల్లి కాలనీని మున్సిపాలిటీలో విలీనం చేయడానికి చర్యలు తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీఆర్ నగర్, నూకలపల్లిని జగిత్యాల పట్టణంలో విలీనం చేయాలని కోరారు.

జిల్లాలోని సుమారు 100 మంది సీనియర్ జర్నలిస్టుల కోసం జర్నలిస్టు కాలనీ ఏర్పాటు చేయాలని, భీర్పూర్ నూతన మండలానికి తహసీల్దార్ కార్యాలయం మంజూరు చేయాలని, రాయికల్ మున్సిపాలిటీకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ పేదలకు గౌరవప్రదమైన ఇళ్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో 4,500 ఇళు
ు నిర్మించబడ్డాయని, అయితే ప్రస్తుతం సుమారు 50 శాతం ఇళ్లలో మాత్రమే ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు.

కాలనీలో మిగిలిన ఇళ్లలో కూడా ప్రజలు నివసించేలా రవాణా, సెల్‌ఫోన్ టవర్లు తదితర అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని కోరారు. 4,500 ఇళ్లతో నూకలపల్లి ఒక చిన్న టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. బ్లాకల వారీగా ఇళ్లకు నంబర్లు కేటాయించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూజగిత్యాల జిల్లాలో మొత్తం 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 2,208 ఇళ్లు నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 8,079 మంది లబ్ధిదారులకు రూ.227 కోట్ల 32 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు.

పట్టణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 4,710 ఇళ్లు పూర్తయ్యాయని, 4,386 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మరో 324 మంది లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,562 గుడిసెలను గుర్తించగా, 1,319 గుడిసెలను పరిశీలించి ధ్రువీకరించినట్లు కలెక్టర్ వివరించారు

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, రాయికల్ మున్సిపల్ చైర్మన్ కాట్కాశీరవీందర్ ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పలు సమస్యల కొరకై వినతి పత్రాలు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026





జగిత్యాల నియోజకవర్గంలోని పలు సమస్యల కొరకై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలని లో ప్రజల సౌకర్యార్థం రేషన్ షాప్ ల మంజూరు గురించి ఏల్ 3 లిస్ట్ లో ఉండి అధికారుల పొరపాటు తో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులకు బిల్లులు మంజూరు మరియు మొదటి విడత లబ్ధిదారులకు ప్రారంభం లో ఇందిరమ్మ ఇళ్ళు స్లాబ్ ఏరియా పెరిగి బిల్లు రాని వారికి బిల్లులు మంజూరి ఇప్పించడం జగిత్యాల పట్టణం మరియు అర్బన్ మండలం నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం చేయుట గురించి బీర్పూర్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం మంజూరు చేయుట గురించి.జగిత్యాల పట్టణ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాల మంజూరు గురించి వినతి పత్రాన్ని అందజేశారు.

# జగిత్యాల జిల్లాలో వరలక్ష్మి వ్రతం ఇంటి ఇంటికి వ్రతం పెద్ద ఎత్తున. వ్రతంలు నిర్వహించిన మహిళలు.







ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

శ్రావణ మాసం వచ్చిందంటే అనేక పండుగలు మొదలవుతాయి వాటిలో మొదటిది వచ్చేది భారతీయ మహిళలు ఇష్టానుసారంగా ఎంతో పెద్దఎత్తున వైభవంగా జరుపుకునే పండుగ శ్రీ వరలక్ష్మి వ్రతం. శ్రావణ మాసంలో పౌర్ణిమ కు ముందు వచ్చే శుక్రవారం రోజున వ్రతమును .ఆచరించడం అనావయితి. సాంప్రదాయం ఆరోజున వీలు కానివారు మరల తరువాత వచ్చే శుక్రవారం లు ఈ వరలక్ష్మి వ్రతం చేసుకొంటారు. మన దేశంలో ని హిందు మహిళలు అందరూ వారి సౌభాగ్యన్ని కాపాడుకునేందుకు తగిన మార్గాన్ని ఉపదేశించ మనీ పార్వతి దేవి శివుడి ని కోరింద ని అపుడు పరమ శివుడు ప్రత్యక్షం అయి అపుడు వారికి వరలక్ష్మి వ్రతం ను ఆచరించ మనీ తెలిపినా రు అని ఆనాటి పెద్దలు చెబుతున్నారు. వరలక్ష్మి వ్రతం ను ముత్తైదువు లు అందరూ ఈ నోము ను భక్తి శ్రద్ధ లతో నోము కోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ కూడా వారి వారి ఇంట్లో వ్రతం కు అవసరమెంన పసుపు కుంకుమ ఎర్రని జాకెట్ బట్ట గంథం గులాబీ చామంతి పూలతో అలంకరించి వరలక్ష్మి వ్రతం చేసుకున్నారు

వరలక్ష్మి వ్రతం చేసుకున్న వారంతా ముత్తైదువ లను కనీసం వారి స్తోమత ను బట్టి అయిదు పదకోండు ఇరువది ఒక్క మంది పిలుచుకొని వారికి వాయునా లు అనగా వచ్చిన ప్రతి ఒక్కరికీ పూలు పసుపు కుంకుమ అరటిపండ్లు తమాల పాకులు కనుము మరియు ఫలహరలు ఇచుకుంటు వారినుండి ఆశీర్వచనం తీసుకుంటామని తెలిపారు.

# తీజ్ ఉత్సవ వేడుకకు 30,000 వేల రూపాయలు విరాళం. BRS రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్.

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026



దేవరకొండ పట్టణం లోని రామ్ రామ్ బంజారా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తీజ్ వేడుకలకు ఉత్సవ కమిటీ సభ్యుకు 30,000 విరాళం ప్రకటించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రమావత్ వంశీ , నేనావత్ జాను, కొర్ర శ్రీధర్ , ప్రకాష్,మాకట్లాల్, కిరణ్. తదితరులు ఉన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి



ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

తీదేడు గ్రామానికి చెందిన తిరుమణి విష్ణు వసంత గార్ల కుమార్తె సుష్మ శివ కుమార్ ల వివాహ వేడుకలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.వారి భవిష్యత్ జీవితం పరస్పర ప్రేమానురాగాలతో. సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి,ధేన్యతండ గ్రామ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మద్రు రామారావు, సిమర్ల శ్రీను యాదవ్,కాయితి బచ్చిరెడ్డి,రమావత్ మాంత్య నాయక్,సిమర్ల పర్వతాలు యాదవ్,సిమర్ల రాములు,సందె నీరంజన్,వీరమల్ల వెంకటయ్య, దాసరి మల్లయ్య, ఉడుత శంకర్. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బాలు నాయక్.

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026



చింతపల్లి మండల పరిధిలోని తీదేడు గ్రామానికి చెందిన తిరుమని విష్ణువసంత దంపతుల కుమార్తె సుష్మ, శివకుమార్‌ల వివాహ వేడుక మాల్ పట్టణంలోని జె.పి. మహల్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు

ఈ వివాహ వేడుకలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత, జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కొండూరు పవన్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, మద్రు ప్రభాకర్ రావు, మద్రు మీనా రావు, శివర్ల శంకర్ యాదవ్, దాసరి ముత్తయ్య, కల్లు శ్రీను, రొడ్డ శ్రీను, ఐతమోని మల్లయ్య, నున్నగోపుల శివ, మెండే యాదయ్య, తిరుమని భీమయ్య, తిరుమని యాదయ్య, తిరుమని ప్రభాకర్, ఉడుత లింగయ్య, మేరిక లచ్చయ్య, తిరుమని పాపయ్య, మర్ల రామలింగం, రాశిక రామలింగం, నిమ్మల లక్ష్మారెడ్డి, తిరుమని రవి పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతో విద్యార్థుల్లో సత్ప్రవర్తనకు రాయికల్ విజ్‌డమ్ స్కూల్‌లో శ్రీరామ హృదయ కలశ పూజ, శ్రీ వరలక్ష్మీ వ్రతం...

## విజ్‌డమ్ విద్యాసంస్థ అధినేత ఎద్దండి ముత్యంపు రాజురెడ్డి...





ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

జగిత్యాల జిల్లా రాయికల్‌లోని విజ్‌డమ్ హైస్కూల్‌లో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి సప్తతి తిరునక్షత్ర శ్రీరామ హృదయ కలశ యాత్ర, వరలక్ష్మి మహావ్రతం కార్యక్రమాలు విజ్‌డమ్ విద్యసంస్థ అధినేత జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జిల్లా బాధ్యులు ఎద్దండి నివేదిత – ముత్యంపు రాజురెడ్డి ఆదర్శ దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతన, సత్ప్రవర్తన, దేశభక్తి పెంపొందించడంతో పాటు ఆచార్యులు, పెద్దలను గౌరవించే సంస్కారం అలవడాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని కొనసాగుతున్న శ్రీరామ హృదయ కలశ యాత్ర పాఠశాలకు తీసుకవచ్చే భాగ్యం కలగడం అదృష్టమని అన్నారు. మొబైల్ అడిక్షన్, తల్లిదండ్రుల అతిగారాబం చిన్న వయసు నుండి జల్సాలకు అలవాటు కావడం వంటి సమస్యలు ప్రస్తుత హై స్కూల్ పిల్లలలో ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ప్రతిరోజు పోషకుల ప్రత్యక్ష పర్యవేక్షణతో పాటు ఆధ్యాత్మికతతోనే విద్యార్థుల్లో మంచి ఆలోచనలు,సత్ప్రవర్తన,బాధ్యతాయుతంగానడుచుకోవడం వలన దేశభక్తి పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థులచే ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించి, కలశానికి భక్తిశ్రద్ధలతో అక్షింతలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని సామూహికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, అంబల్ల శివ, మరింగంటి కళ్యాణాచార్యులు, లక్ష్మి, సరోజ, రాణి, శశి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆచార్యులవారి, శ్రీవరలక్ష్మీ మాత, శ్రీరామచంద్రుని, అనుగ్రహ ప్రసాదం పొందారు.

# వేల్పూర్: వైభవంగా సిరులొలికే చల్లని తల్లి వరలక్ష్మి వ్రతం



ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026

వేల్పూర్ మండలం కేంద్రంలోని శుక్రవారం దేవి ఆలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.అష్టైశ్వర్యాలు, సిరిసంపదలు ప్రసాదించే మహాలక్ష్మి స్వరూపమే వరలక్ష్మి అమ్మవారిని అన్నారు.ఉదయం సాంప్రదాయంగా పంచామృత అభిషేకం,పూలు,పసుపు,కుంకుమ, హారతి,ప్రసాదలతోపాటు పల్లకి సేవ చేపట్టారు.అధిక సంఖ్యలోభక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు,అభిషేకాలు, పల్లకి సేవ నిర్వహించినట్లు ఆలయ పూజారి జంగం గంగాధర్ తెలిపారు.భక్తులందరూ వరాలిచ్చే అమ్మవారిని వేడుకున్నారు.

# జగన్‌తో చిర్రా రవీందర్ యాదవ్ భేటీ

ట్రై నెట్ న్యూస్। 21 ఆగస్టు 2026



హైదరాబాద్ పర్యటనలో భాగంగా వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని శుక్రవారం చిర్రా రవీందర్ యాదవ్ ప్రత్యేకంగా కలిశారు. సుదీర్ఘకాలం తర్వాత జరిగిన ఈ భేటీలో ఇరువురు నేతలు ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు.

ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ యోగక్షేమాలతో పాటు కుటుంబ వివరాలు, భవిష్యత్ కార్యక్రమాలపై జగన్ ఆరా తీశారు. జగన్‌తో సమావేశం పట్ల రవీందర్ యాదవ్ సంతోషం వ్యక్తం చేయగా, ఈ కలయిక ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## శాస్త్రీయ సంగీత కచేరీ






**చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21:**
కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య సూర్యకాంత పుత్ర డాక్టర్ పుచ్చా వేంకటరామశాస్త్రి చే 'సంగీతానందలహరి - నాద విలాసం' శీర్షికన శాస్త్రీయ సంగీత కచేరీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళావేదికలో నిర్వహించారు . మృదంగం: పి. జనార్ధన్, వయోలిన్: కొండపల్లి శ్రీనివాస్ వాద్య సహకారం అందించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొని కళాకారులను అభినందించి సత్కరించారు.

## ప్రజ్ఞా ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'మధుర రాగ రంజని' సంగీత విభావరి






**చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21:**
ప్రజ్ఞా ఆర్ట్స్ ఆధ్వర్యంలో "మధుర రాగ రంజని" పేరిట సినీ సంగీత విభావరి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ కళాదీక్షితులు కళావేదిక'లో నిర్వహించారు . కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా రేడియో నాటక విభాగాధిపతి మద్దిపట్ల విశ్వనాథ్ , గౌరవ అతిథిగా సీనియర్ న్యాయవాది, తెలంగాణ ఉన్నత న్యాయస్థానం శ్రీ వడ్లకొండ వెంకటరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా "రాగ కళా సరస్వతి" శివరమ్య ధరణిప్రగడనిర్వహణలో గాయనీ, గాయకులు సంతోష్ వేణుగోపాల్ , వెంకటేశ్వర్లు రవికుమార్, లక్ష్మీగోపాల్, సవితాశ్రీ, పద్మశ్రీ, అలరించిన సినీ గీతాలు అలరించాయి.

## డాక్టర్ కేతవరపు రాజశ్రీకి పురస్కార ప్రదానం






**చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21:**
'భీమన్న సాహితీ నిధి' 'కళానిలయం' సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మధురగాయిని, ఉత్తమ ఉపాధ్యాయురాలు, ప్రముఖ రచయిత్రి హైమావతి భీమన్న జన్మోత్సవ వేడుకలు చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర తొలి స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి పాల్గొని హైమావతి భీమన్న తల్లిదండ్రులైన స్వర్గీయ " కొత్తూరి వేంకట లక్ష్మి - కొత్తూరి సుబ్బయ్య దీక్షితులు" స్మారక పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి, కవయిత్రి డాక్టర్ కేతవరపు రాజశ్రీకి2026 సంవత్సరానికి గాను ఈ పురస్కారం కింద రూ. 5,116/- నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 21 సంవత్సరాలుగా కవులను, రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సభకు ముందు మంజీర అకాడమీ ఆఫ్ కూచిపూడి డాన్స్ అధ్యక్షురాలు , ప్రముఖ నాట్య గురువు జె. రేణుకా ప్రభాకర్‌శిష్య బృందం ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయంపూర్వ రిజిస్ట్రార్ ఆచార్య బి. గౌరీ శంకర్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆచార్య డాక్టర్ కొయ్యి కోటేశ్వర రావు, రచయిత్రి, సంస్థ అధ్యక్షురాలు హైమావతి భీమన్న, మాజీ డిఎస్పి సుంకర సత్యనారాయణ , ప్రముఖ రచయిత్రి డాక్టర్ గురువాడ శోభా పేరిందేవి, కళానిలం అధ్యక్ష కార్యదర్శులు ఎం సురేందర్ , ఎం పుష్పలత పాల్గొన్నారు.

## అష్టలక్ష్మీ కలశాలతో శ్రావణవ్రతం

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21:**
పరాభవ నామ సంవత్సరం శ్రావణ మాస వరలక్ష్మీవ్రతం సందర్భంగా సూర్యారావుపేట దూసర్లపూడి వారి వీధిలోని స్వయంభు భోగి గణపతి పీఠంలో వ్రత మహోత్సవాలను ప్రారంభించారు. సన్నాయి మంగళ వాయిధ్యాల నడుమ ధనలక్ష్మి ధాన్యలక్ష్మి ధైర్యలక్ష్మి సంతానలక్ష్మి గజలక్ష్మి సంతానలక్ష్మి విజయలక్ష్మిఐశ్వర్యలక్ష్మి కలశాలను నగర సంకీర్తనతో ఊరేగింపు నిర్వహించి ప్రతిష్ఠించారు. పంచామృతాలతో అష్టలక్ష్మీ మాతను అభిషేకించారు . సహస్రనామపారాయణం చేపట్టి పూజలు నిర్వహించారు. పీఠం ఉపాసకులు రమణరాజు మాట్లాడుతూ ధన, ధాన్య, ధైర్య, శౌర్య, విద్య, కీర్తి, సంతాన, విజయ అనుగ్రహం అందించే అష్టలక్ష్మీ ఆరాధ్య రూపాలను హిందూ ధర్మంలో



పూజించడం సనాతన సంప్రదాయంగా పేర్కొన్నారు. ఈనెల 24 వరకు ప్రతీ రోజు ఉదయం 8, రాత్రి 7 గంటలకు కాగడాలతో నగర సంకీర్తన జరుగుతుందని చివరి రోజు సోమవారం మధ్యాహ్నం మహా కుంభం అన్నదానం జరుగుతుందని తెలియజేశారు. మహిళలకు తాంబూలాలు అందించారు

## హైదరాబాద్‌లో ఎకరం భూమి రూ.264 కోట్లు --- టీజీఐఐసీ వేలంలో సరికొత్త రికార్డు

**ట్రినెట్ న్యూస్। 21 ఆగస్టు 2026**
హైదరాబాద్ నగర భూముల ధరలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లోని అత్యంత కీలకమైన రాయదుర్గం ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం భూమికి ఏకంగా రూ.264 కోట్ల ధర పలకడం సంచలనంగా మారింది. భూముల ధరలు ఎంతటి స్థాయికి చేరుకున్నాయో ఈ వేలం ఫలితం స్పష్టంగా తెలియజేస్తోంది.
రాయదుర్గం జ్ఞానసగర్ పరిధిలోని అత్యంత విలువైన భూమిని టీజీఐఐసీ ఈ-వేలం ద్వారా విక్రయానికి పెట్టింది. ఈ వేలంలో సుమారు 5.25 ఎకరాల స్థలం ఎకరానికి రూ.264 కోట్ల చొప్పున దక్కినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంటే మొత్తం స్థలం విలువ సుమారు రూ.1,386 కోట్లకు చేరుతుంది. ఈ స్థాయి ధర హైదరాబాద్ వాణిజ్య భూముల మార్కెట్‌లో కొత్త చర్చకు తెరలేపింది.

**గత రికార్డులను అధిగమించిన ధర**
రాయదుర్గం ప్రాంతంలో టీజీఐఐసీ నిర్వహించిన గత వేలాలు కూడా భారీ ధరలను నమోదు చేశాయి. 2026 మేలో 6.29 ఎకరాల భూమి ఎకరానికి రూ.237 కోట్ల ధరకు విక్రయమై, మొత్తం రూ.1,490.73 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూర్చింది. ఆ సమయంలో అది హైదరాబాద్ భూముల వేలంలో కొత్త రికార్డుగా నిలిచింది.
అయితే తాజాగా ఎకరానికి రూ.264 కోట్ల ధర పలకడంతో ఆ రికార్డు కూడా అధిగమించబడింది. కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో ఇది తెలియజేస్తోంది.

**ఎందుకు ఇంత భారీ ధర?**
రాయదుర్గం హైదరాబాద్‌లోని అత్యంత అభివృద్ధి చెందిన వాణిజ్య ప్రాంతాల్లో ఒకటి. ఐటీ సంస్థలు, బహుళజాతి కంపెనీలు, కార్యాలయ సముదాయాలు, ఆర్థిక సంస్థలు, ప్రముఖ వాణిజ్య కేంద్రాలు ఈ ప్రాంతం చుట్టూ విస్తరించి ఉన్నాయి. హైటెక్ సిటీ, ఆర్థిక జిల్లా, గచ్చిబౌలి వంటి ప్రాంతాలకు సమీపంలో ఉండటం రాయదుర్గం భూములకు ప్రత్యేక ప్రాధాన్యతను తెచ్చింది.
ప్రధాన రహదారులు, మెరుగైన రవాణా సౌకర్యాలు, ఐటీ సంస్థల విస్తరణ, భవిష్యత్ వాణిజ్య అవకాశాలు వంటి అంశాలు ఈ ప్రాంతంలో భూముల విలువను విపరీతంగా పెంచుతున్నాయి. పెద్ద సంస్థలు తమ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల కోసం ప్రధాన ప్రాంతాల్లో భూమిని పొందేందుకు భారీ మొత్తాలు చెల్లించేందుకు సిద్ధపడుతున్నాయి.




**ప్రభుత్వానికి భారీ ఆదాయం**
ప్రభుత్వ భూములను పారదర్శక ఈ-వేలం ద్వారా విక్రయించడం ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. గతంలో జరిగిన రాయదుర్గం వేలంలోనే దాదాపు రూ.1,490 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. మరో 5.09 ఎకరాల స్థలం జూన్‌లో జరిగిన వేలంలో సుమారు రూ.1,038.36 కోట్లకు విక్రయమైందని నివేదికలు వెల్లడించాయి.
ఇప్పుడు ఎకరానికి రూ.264 కోట్ల ధర పలకడంతో ప్రభుత్వ భూముల విలువపై కొత్త అంచనాలు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ భూమి అంటే సాధారణ ఆస్తిగా భావించిన పరిస్థితి నుంచి, ఇప్పుడు నగరంలోని ప్రధాన ప్రాంతాల్లోని భూములు ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని అందించే ఆస్తులుగా మారాయి.

**సామాన్య ప్రజలకు అందని ధరలు**
అయితే భూముల ధరలు ఇంత భారీగా పెరగడం సామాన్య ప్రజలకు ఆందోళన కలిగించే అంశంగా కూడా మారింది. ఎకరం భూమి రూ.264 కోట్లకు చేరిన ప్రాంతాల్లో సాధారణ కుటుంబాలు భూమిని కొనుగోలు చేయడం దాదాపు అసాధ్యంగా మారుతోంది. భూముల ధరల పెరుగుదలతో పాటు ఇళ్ల ధరలు, అద్దెలు కూడా పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ వర్గాలు భావిస్తున్నాయి.
అయితే ఈ ధరను నగరంలోని అన్ని ప్రాంతాలకు వర్తించే సాధారణ భూమి ధరగా చూడకూడదు. ఇది అత్యంత కీలకమైన వాణిజ్య ప్రాంతంలోని ప్రభుత్వ భూమికి జరిగిన ప్రత్యేక వేలం. భూమి వినియోగం, నిర్మాణ అనుమతులు, ప్రాంత ప్రాధాన్యత, రహదారి అనుసంధానం వంటి అంశాల ఆధారంగా ధరలు విపరీతంగా మారుతాయి.

**అభివృద్ధికి సంకేతమా?**
రాయదుర్గం వేలంలో ఎకరానికి రూ.264 కోట్ల ధర రావడం హైదరాబాద్ నగరంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి సంకేతంగా కొందరు నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ, వాణిజ్య, కార్యాలయ రంగాల్లో హైదరాబాద్ ప్రాధాన్యత పెరుగుతున్నదనే విషయాన్ని ఈ వేలం సూచిస్తోందని అభిప్రాయపడుతున్నారు.
మరోవైపు ఇంత విలువైన భూములను ప్రభుత్వం విక్రయించడం సరైన విధానమా? భవిష్యత్ అవసరాల కోసం కొంత భూమిని ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలా? అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. రాయదుర్గం ప్రాంతంలోని కొన్ని భూముల విషయంలో న్యాయపరమైన, వారసత్వ పరిరక్షణకు సంబంధించిన అంశాలు కూడా చర్చకు వచ్చాయి.

**హైదరాబాద్ భూములకు పెరుగుతున్న డిమాండ్**
హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తున్న కొద్దీ ప్రధాన ప్రాంతాల్లో భూమి లభ్యత తగ్గుతోంది. దీంతో పెద్ద స్థలాలకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా ఐటీ సంస్థలు, కార్యాలయ సముదాయాలు, వాణిజ్య ప్రాజెక్టులకు అనువైన స్థలాలు పరిమితంగా ఉండటంతో పోటీ పెరుగుతోంది.ఎకరానికి రూ.264 కోట్లు పలకడం కేవలం ఒక భూమి వేలం విజయంగా కాకుండా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మారుతున్న పరిస్థితులకు ప్రతిబింబంగా చూడవచ్చు. గతంలో రూ.100 కోట్లు దాటితేనే సంచలనంగా భావించిన భూముల ధరలు ఇప్పుడు రూ.200 కోట్లను దాటి, రూ.264 కోట్ల స్థాయికి చేరుకోవడం నగర అభివృద్ధి వేగాన్ని తెలియజేస్తోంది.

**ముగింపు**
రాయదుర్గం జ్ఞానసగర్‌లో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరానికి రూ.264 కోట్ల ధర పలకడం హైదరాబాద్ భూముల మార్కెట్‌లో సరికొత్త రికార్డుగా నిలిచింది. 5.25 ఎకరాల స్థలానికి సుమారు రూ.1,386 కోట్ల విలువ ఏర్పడటం దేశంలోని ప్రముఖ వాణిజ్య నగరాల్లో హైదరాబాద్ స్థానం ఎంత బలపడిందో తెలియజేస్తోంది.
అయితే భూముల విలువ పెరగడం నగర ఆర్థికాభివృద్ధికి ఒక సూచిక మాత్రమే. ఈ అభివృద్ధితో పాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే గృహాలు, మెరుగైన ప్రజా రవాణా, పచ్చదనం, మౌలిక సదుపాయాలు, సమతుల్య నగరాభివృద్ధి కూడా కొనసాగాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ భూముల ధరలు భవిష్యత్తులో మరింత పెరుగుతాయా, లేక ప్రస్తుత స్థాయిలో స్థిరపడతాయా అన్నది రాబోయే కాలమే నిర్ణయించాలి.

## వైభవంగా వరలక్ష్మి వ్రత పూజలు

## ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవి పుత్రిక కనక విజయలక్ష్మి

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 21:**
సామర్లకోట పట్టణంలోని బడేలమ్మ చెరువు వద్ద గల శ్రీ నవదుర్గ సమేత దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయం ముత్తయిదువులతో కిటకిటలాడింది. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఎక్కడ జరగని రీతిలో ఈ ఆలయంలో ప్రతి ఏడాది శ్రావణ శుక్రవారం పూజలైన వరలక్ష్మి వ్రత పూజలు ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవి పుత్రిక కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో అతి వైభవంగా నిర్వహించడం పరిపాటి. దానిలో భాగంగానే ఈ ఏడాది వరలక్ష్మీ వ్రత పూజలను వేలాదిమంది ముత్తైదువులు, మహిళ భక్తుల సమక్షంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఆలయంలోని దుర్గాదేవికి, నవదుర్గలకు పంచామృత అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఆలయానికి భారీగా తరలివచ్చిన ముత్తైదువులకు అమ్మ కనక విజయలక్ష్మి ఘనంగా స్వాగతం పలికారు.



కొబ్బరికాయ కొట్టి, హారతిలిచ్చి ముత్తైదువులను ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో అష్టలక్ష్మిలుగా ఎంపిక చేసిన ఎనిమిది మంది ముత్తైదువులను సిద్ధం చేసి వారికి మంగళ స్నానాలు ఆచరింపజేసి, అలంకరించి, వారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఏర్పాటు చేసిన విందు భోజనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలు రకాల పిండి వంటలతో పాటు ఆహార పదార్థాలను ప్రత్యేక రీతిలో సిద్ధం చేసి 2026 మంది ముత్తైదువులు, మహిళా భక్తులకు వడ్డించగా వారు



ఆనందంతో విందు భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే వ్రత పూజల్లో భాగంగా ఆలయంలో కోలాటం, సామూహిక కుంకుమ పూజలు, నవదుర్గల పూజలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం ఆలయంలో 316 మంది ముత్తైదువులకు డ్రా పద్ధతిలో అమ్మవారి చీరలను అందించే కార్యక్రమం కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజలన్నీ ఆలయ అర్చకులు ఆళ్లక్కి లక్ష్మణ శాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజల్లో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు.










edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136